


ఏపీ ప్రభుత్వం గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుని విశాఖను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు బాటలు వేసింది. సీఎం చంద్రబాబు, లోకేష్ దూరదృష్టితో 1.88 లక్షల ఉద్యోగాలు, గ్లోబల్ గుర్తింపు రాష్ట్రానికి రానున్నాయి. ఇది అభివృద్ధి నూతన యుగానికి శ్రీకారం.

**జర్నలిస్ట్‌ఫైల్ యాజమాన్యం, సిబ్బంది**

బుధవారం 15.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 179 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

- అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు నిర్ణయం
- దేశంలో తొలి ఏఐ డేటా హబ్ ప్రకటించిన గూగుల్
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్
- దేశంలో మొదటి గిగావాట్ స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం గర్వకారణమన్న సీఎం చంద్రబాబు
- భారత డిజిటల్ ట్రాన్సఫర్మేషన్ కు ఇది సరికొత్త అధ్యాయమన్న ముఖ్యమంత్రి
- డేటా సెంటర్ ఏర్పాటు పై ఎక్స్ వేదికగా ప్రకటించిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్





## ఏపీలో గూగుల్ డేటా సెంటర్... దేశానికే గర్వకారణం

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆంధ్రప్రదేశ్ సువర్ణ అధ్యాయం లిఖించింది. ప్రపంచాన్ని శాసిస్తున్న డేటా, ఏఐ లాంటి రంగాల్లో విశాఖ నగరం కేంద్ర బిందువు కానుంది. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖ వేదికగా భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించింది. అమెరికా వెలుపల అతి పెద్ద ఏఐ డేటా హబ్ ను విశాలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ఈమేరకు ఢిల్లీలో జరిగిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం రానున్న ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ" వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో ఒక కొత్త అధ్యాయం. దేశంలో మొదటి గిగావాట్-స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం ఏపీకి గర్వకారణం. రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటుంది. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రతీ కుటుంబానికీ దగ్గర చేసేలా ప్రయత్నిస్తాం.

మిగతా 2లో...



### రాష్ట్ర గ్రామీణ ముఖచిత్రం మారేలా
## పల్లె పండగ 2.0

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా పల్లె పండగ 2.0 ప్రణాళికలు ఉండాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ముఖచిత్రం సంపూర్ణంగా మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో త్వరలో ప్రారంభం కానున్న పల్లె పండుగ 2.0పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారుల అభివృద్ధి, నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గోశాలలు, మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఒ.ఎస్.డి. వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ చీఫ్ పంచాయతీరాజ్ బాలు నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అవినీతి కంపు... ప్రభుత్వానికి తలవంపు..!!

- జిల్లాలో పెట్రేగిపోతున్న లంచావతారాలు
- ప్రతి శాఖలో అవినీతి. కంపు
- ఫిర్యాదు చేస్తేనే ఏసీబీ దాడులు
- కాసులిస్తేనే కరుణిస్తారా? మీరు మారరా?
- తీరు మారని అధికారులతో ప్రభుత్వానికి తల వంపు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పాతుకుపోయిన అవినీతి నిర్మూలించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం లో చిన్న పని కి వెళ్ళినా చేతులు తడపందే పనులు కావడం లేదు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల అండదండలను చూసుకొని దిగువ స్థాయి సిబ్బంది నుంచి ఆ శాఖ ఉన్నతాధికారుల వరకు జలగల్లా మారి రక్తాన్ని పిలుస్తున్నారు. పెద్ద జిల్లాలు విడిపోయి పార్లమెంటుకు ఒక జిల్లా చొప్పున మారినా అన్ని శాఖల్లో అవినీతి మాత్రం పాతదే.. ప్రతి పనికీ కమీషన్లే. కొత్త పాలనా యంత్రాంగంలో కూడా అవినీతి యథేచ్ఛగా సాగుతోంది. అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఇదే తీరు నడుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు వస్తేనే ఏసీబీ స్పందిస్తోందని, లేకపోతే పట్టించుకోవడం లేదనే వాదన కూడా ఉంది. ఈ అవినీతికి అంతేమైనా ఉందా? అనే చర్చ సాగుతోంది..

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తేనే ఏసీబీ అధికారులు దాడి చేసే పరిస్థితికి వచ్చారు. అనేక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు పెద్ద ఎత్తున లంచాలకు పాల్పడుతూ ఆ శాఖ ప్రతిష్టకు తీరని మచ్చ తెస్తున్నారు .ఎక్కడైనా ఏసీబీ అధికారుల వలకు చిక్కితే శిక్ష పడకుండా తప్పించుకుంటున్నారు. దీనికి కారణం చట్టంలో ఉన్న లోపాలే. ఒక అధికారి ఎన్నిసార్లు ఏసీబీకి చిక్కనా ఆ ఉచ్చు నుంచి బయట పడ్డాక మళ్లీ అదే శాఖ లో పదోన్నతులు పొంది దర్జాగా కొనసాగుతున్నారు. దీంతో అవినీతి నిరోధక శాఖ పై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది.

2లో...

## హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీ నీవా నీరుతో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సిఈ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారాయన. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను అందరినీ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. చివరన ఉన్న కుప్పం వరకు కృష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు.

రాయలసీమకు గుండెకాయ అయిన హంద్రీనీవా ప్రాజెక్ట్ ని గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం ఆటకెక్కించింది అన్నారు. ఆ ప్రభుత్వం ఐదేళ్లలో చేయనిది, కూటమి ప్రభుత్వం సంవత్సరంలో చేసి చూపించిందని రామానాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్ని 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86% నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు.

మిగతా 2లో...

## గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికి అభివృద్ధి నూతన యుగం

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందాన్ని చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఈ గొప్ప ఒప్పందం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దూరదృష్టితో సాధ్యమైందని. గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఉత్తరాంధ్రలో అభివృద్ధి నూతన యుగం ప్రారంభమై, విశాఖపట్నానికి ప్రపంచ పటంలో కొత్త గుర్తింపు రానుందని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా 1.88 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలగబోతున్నాయని, విశాఖ టెక్నాలజీ, ఉద్యోగాలు, అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. సీఎం చంద్రబాబు సాంకేతిక దృష్టి, ప్రగతి పథం ఆలోచనల వల్లే గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని హైలైట్ చేశారు.

రియల్‌టైమ్, హిస్టారికల్ డేటాతో వేగంగా నిర్ణయాలు తీసుకునే యుగానికి నాంది పలికిందని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ప్రణాళిక అభివృద్ధి కొత్త దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో గ్లోబల్ ఏకైక కాన్ఫరెన్స్ నిర్వహణకు సీఎం చంద్రబాబు ఆలోచన ప్రగతిశీలమని, ప్రతి కుటుంబానికి ఏఐ సాంకేతికతను చేరువ చేయాలన్న సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు గర్వకారణమైన రోజు ఇదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు.

## డొక్కు... తుక్కు అంబులెన్సులకు గుడ్ బై

- రోడ్లపైకి 190 కొత్త 108 వాహనాలు
- "గోల్డెన్ అవర్ " లోగానే అసుపత్రులకు తరలింపు
- "నేషనల్ అంబులెన్సు కోడ్" ఆధారంగా రంగులు మార్పు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 190 కొత్త 108 (అత్యవసర) అంబులెన్సులను రోడ్లపై తీసుకురాబోతుంది. దీనివల్ల రోడ్డు, ఇతర ప్రమాద క్షతగాత్రులను ఇప్పటికంటే మరింత వేగంగా ఆసుపత్రులకు తరలించేందుకు వీలు కలుగుతుంది.

కూటమి ప్రభుత్వం టెండరు నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం సిద్ధమైన ఈ కొత్త అంబులెన్సులను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు.

2లో...

## విశాఖకు గూగుల్ రాక ఆంధ్రప్రదేశ్ ఐటీ మ్యాప్‌లో నూతన చరిత్ర



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ ప్రసిద్ధ గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నంకు రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలను తీసుకువచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్లే, ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను ఆహ్వానించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారనుందని వ్యాఖ్యానించారు. విశాఖలో గూగుల్ రాకతో రాష్ట్ర ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని,

మిగతా 2లో...

## గూగుల్ పెట్టుబడుల వెనుక మంత్రి లోకేష్ కీలక పాత్ర

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు ఏపీ చరిత్రలోనే కాకుండా...దేశ ఐటీ చరిత్రలోనే ఇదొక పెద్ద మలుపు కానుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ దశ దిశ నాడు మైక్రోసాఫ్ట్‌తో మారిందని....నేడు ఏపీలో గూగుల్ డాటా సెంటర్ ఆ పాత్ర పోషిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీకి గూగుల్ డాటా సెంటర్ రావడంలో ఐటీ మంత్రి లోకేష్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ సంస్థను సంప్రదించి...నిరంతరం ఫాలో అప్ చేయడం వల్లే లక్ష్యాన్ని చేరుకున్నామని సీఎం అన్నారు.

మిగతా 2లో...

**ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే భారీ పెట్టుబడులు**

**విశాఖలో గూగుల్ డాటా సెంటర్ దేశానికే తలమానికం**

**అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ సంస్థను లోకేష్ సంప్రదించారు**

**ఏఐ డాటా సెంటర్‌తో విద్య, వైద్యం, వ్యసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు**

**గూగుల్ ఇన్వెస్టిమెంట్‌పై శుభాకాంక్షలు తెలిపిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సీఎం**



## హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి



(మొదటి పేజీ తరువాయి)

అలాగే రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయి అన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయి. వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్య క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు.

ఈ కారణంగా ప్రస్తుతం రాయలసీమ చెరువుల్లో జలసిరి తాండవిస్తోందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్న ఆయన ఆశయం మేరకు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నామన్నారు. ప్రతిష్టాత్మకమైన హంద్రీనీవాకు రూ 3,850 కోట్ల రూపాయలు వెచ్చించడమే గాక 738 కిలో మీటర్లు కృష్ణమ్మ జలాలను కుప్పం వరకు తీసుకెళ్లడం ఒక చరిత్రగా మంత్రి అభివర్ణించారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న చెరువులను నింపే బాధ్యతను, పర్యవేక్షణను ఇరిగేషన్ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులకు కూడా అప్పగించినట్లు రామానాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అక్కడున్న కలెక్టర్లు, తహసిల్దార్లు, వీఆర్వోలు వరకు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని ఆయన స్పష్టం చేశారు.

ఈ ఆనంద సమయంలో రాయలసీమ ప్రజలు గత ప్రభుత్వ పనితీరుకు, కూటమి ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో సినిమా సెట్టింగులు, అద్దె ట్యాంకర్లు, అద్దె గేట్లు, బెంగళూరు నుంచి పూలు తెప్పించి నీటి వనరుల ప్రారంభోత్సవాలు నిర్వహించిన సంగతి, జగన్ హెలికాప్టర్ ఎక్కే సమయానికి ఆ నీరు ఆవిరి అయిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుందని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. రాయలసీమ ముద్దుబిడ్డనని చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు తీరని ద్రోహం చేశాడని రామానాయుడు విమర్శించారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పింది చేస్తున్నారు. చేసిందే చెబుతున్నారు. వాస్తవాలన్నీ ప్రజలు కళ్లారా చూసే విధంగా ఈ ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా ఉన్న సంగతి గమనించాలని రామానాయుడు విజ్ఞప్తి చేశారు.

హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశగా మడకశిర బ్రాంచ్ కాలువ పనులు అన్నీ పూర్తి చేసి హిందూపురం, మడకశిర, పెనుగొండ నియోజవర్గాలకు నీరుస్తామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి 400 కిలోమీటర్ల నుంచి 554 కిలోమీటర్ల వరకు అంటే అడివిపల్లి రిజర్వాయర్ నుంచి నీవా, అక్కడ నుంచి తిరుపతి కళ్యాణి డ్యామ్ వరకు అతి త్వరలో నీరు తీసుకెళ్లాలనేది ముఖ్య మంత్రి ఆశయంగా రామానాయుడు స్పష్టం చేశారు. తద్వారా రాయలసీమను రతనాల సీమ చేయాలని కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భాజపా పార్టీ లు కృత నిశ్చయంతో ఉన్నట్లు మంత్రి మరోసారి చెప్పారు.

ఈసమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఈలు కబీర్ భాషా నాగరాజు, ఎస్ఈలు, ఈఈలు, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డొక్కు... తుక్కు అంబులెన్సులకు గుడ్ బై




(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో డొక్కు తుక్కుగా తయారై.. తరచూ మరమ్మతులకు గురవుతున్న అంబులెన్సులను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త అంబులెన్సులను నడుపనున్నారు. దీనివల్ల 'గోల్డెన్ అవర్'లోనే. రోడ్డు, ఇతర ప్రమాద క్షతగాత్రులకు ఆసుపత్రుల్లో వైద్యం అందుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా 'నేషనల్ అంబులెన్సు కోడ్' ప్రకారం అంబులెన్సులపై రంగులు వేసినట్లు పేర్కొన్నారు.

**కాలంచెల్లిన వాహనాలకు ఇక సెలవు**

గత వైకాపా పాలనలో 108 (అత్యవసర) అంబులెన్సుల నిర్వహణ ఘోరంగా తయారైంది. పనితీరు సామర్థ్యానికి మించి కాలం చెల్లిన అంబులెన్సులు నడిపారు. దీనివల్ల క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరిగింది.

చాలా అంబులెన్సుల టైర్లు, ఇంజన్లు దెబ్బతిన్నాయి, అంబులెన్సుల తలుపులకు గడియలు కూడా లేవు. అంబులెన్సులు తరచూ మరమ్మతులకు గురయ్యాయి. దీనివల్ల 108 కాల్ సెంటర్ కు ఫోన్ రాగానే సకాలంలో అంబులెన్సులు ఘటనా స్థలాలకు చేరుకోని పరిస్థితులుండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక టెండరు ద్వారా ఎంపిక చేసిన 'భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 'సంస్థకు ఈ ఏడాది ఏప్రిల్లో 108 అంబులెన్సుల నిర్వహణ బాధ్యతల్ని అప్పగించింది. ప్రభుత్వం విధించిన నియమ నిబంధనల్లో భాగంగా సదరు సంస్థ ఒక్కొక్క అంబులెన్సుకు సుమారు రూ. 27 లక్షల వరకు ఖర్చుపెట్టింది. ఇందులో 56 అడ్వాన్సు సపోర్టు, 134 బేసిక్ అడ్వాన్సు సపోర్టు అంబులెన్సులు ఉన్నాయి. అడ్వాన్సు సపోర్టు అంబులెన్సులో ప్రధానంగా రెండు వెంటిలేటర్లు, ఇతర పరికరాలు అందుబాబులో ఉంటాయి. దీనివల్ల ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు వీలవుతుంది. కాల్ సెంటరుకు ఫోన్ వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రులకు గంటలోపు తరలించడాన్ని 'గోల్డెన్ అవర్' గా పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 650 అంబులెన్సులు నడుస్తున్నాయి. వీటిలో పాతవాటిని తొలగించగా కొత్తవాటితో కలిపి మొత్తం నడిచే వాహనాల సంఖ్య 731కు చేరుకుంది.

**జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రంగులు మార్పు**

గత ప్రభుత్వ పాలనలో నీలం రంగు, ఆకుపచ్చ రంగుతో అంబులెన్సులు ఉండేవి. కేంద్ర ప్రభుత్వ నేషనల్ అంబులెన్స్ కోడ్ ప్రమాణాలనుసరించి ఈ కొత్త 190 అంబులెన్సులపై తెలుపు, ఎరుపు రంగులు ప్రధానంగా ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లోని 108 అంబులెన్సులపై ఇవే రంగులుండాలని కేంద్ర ప్రభుత్వ నేషనల్ అంబులెన్స్ కోడ్ స్పష్టం చేసింది.

## విశాఖకు గూగుల్ రాక ఆంధ్రప్రదేశ్ ఐటీ మ్యాప్‌లో నూతన చరిత్ర


(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలకు అనుకూల వాతావరణం, సమర్థవంతమైన నాయకత్వం కారణంగా టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు కూడా రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని ఆయన అన్నారు.

చంద్రబాబు, లోకేష్ నిరంతరం కృషి చేసి వివిధ అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత 16 నెలల్లో రూ. 11.20 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 9.5 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించడం ఆ ప్రయత్నాల ఫలితమని వివరించారు.

గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు లభించబోతున్నాయని, "సిటీ ఆఫ్ డెస్టినీ"గా పేరు పొందిన విశాఖపట్నం త్వరలోనే ఏఐ, డిజిటల్ సిటీగా మారబోతుందని మంత్రి సత్యప్రసాద్ నమ్మకం వ్యక్తం చేశారు.

# ఏపీలో గూగుల్ డేటా సెంటర్... దేశానికే గర్వకారణం






(మొదటి పేజీ తరువాయి)

హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది. ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలు. ఇంతటి భారీ పెట్టుబడిని ఏపీకి తీసుకురావటంలో ప్రధాన పాత్ర పోషించిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**డేటా సెంటర్ పాలసీతో ఏపీకి అతి పెద్ద గూగుల్ ఏఐ డేటా హబ్ :** విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ కెపాసిటీ, సబ్ సీ గేట్ వే సహా భారీ స్థాయి ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్టు తెలిపారు. దేశ ప్రగతిలో ఈ పెట్టుబడి, ఏఐ డేటా సెంటర్ కీలకంగా మారబోతున్నట్టు సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడినట్టు సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఈ ట్వీట్ పై స్పందించిన ప్రధాని మోదీ విశాఖ నగరంలో గూగుల్ ఏఐ డేటా హబ్ ద్వారా టెక్నాలజీ అందరికీ చేరువ అవుతుందని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా భారత నిర్మాణంలో ఈ ఐటీ మౌలిక సదుపాయం కీలకంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇక భారత్ ఏఐ శక్తి పేరిట నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు ఈ ప్రాజెక్టుతో వివిధ రంగాలకు అవసరమైన సేవలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావటం దేశ ప్రగతిలో అత్యంత కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. విజనరీ నేతలు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి వారి ఆలోచనలు తీసుకువచ్చిన విధానాల వల్ల ఈ ప్రాజెక్టు సాకారం అయ్యిందన్నారు. ప్రోగ్రెసివ్ పాలసీలు, నిర్ణయాల్లో డైనమిజం వల్లే ఇది సాధ్యం కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ ఈ తరహా సుపరిపాలన ఉందిని తెలిపారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్ గా విశాఖ మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ వ్యాఖ్యానించారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. భారత్ తో పాటు వివిధ దేశాలను అనుసంధానించేందుకు విశాఖలోని డేటా హబ్ వేదిక అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు , గూగుల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

**విశాఖ నుంచే ప్రపంచ దేశాలకు అనుసంధానం :** ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా 2030 నాటికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని భారత కరెన్సీలో (రూ. 1.33 లక్షల కోట్లు) విశాఖలో పెట్టనుంది. అమెరికా వెలుపల ప్రపంచంలోనే భారీ పెట్టుబడిగా గూగుల్ సంస్థ స్పష్టం చేసింది. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ సామర్థ్యంతో ఏఐ డేటా హబ్ ను గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. గూగుల్ జెమిని ఏఐ, గూగుల్ సెర్చ్, గూగుల్ వర్క్ స్పేస్ , యూట్యూబ్, క్లౌడ్, జీమెయిల్ లాంటి సేవలను ఈ హబ్ ద్వారా అందించనుంది.

భారత్ దేశంతో పాటు దక్షిణాసియా దేశాలైన సింగపూర్, మలేసియా సహా ఆస్ట్రేలియా లాంటి దేశాలకు విశాఖ ఏఐ డేటా హబ్ నుంచే గూగుల్ సేవలు అందనున్నాయి. మొత్తంగా విశాఖ నుంచి 12 దేశాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను గూగుల్ సమకూర్చుకోనుంది. ఇందులో భాగంగా సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. రెండు మిలియన్ మైళ్ల కంటే పొడవైన సబ్ సీ కేబుల్ ద్వారా ప్రపంచానికి కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ మారనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గూగుల్ యూజర్లకు మరింత వేగంగా సేవలు అందించేలా ఈ ఏఐ డేటా హబ్ సేవలు అందించనుంది.

## గూగుల్ పెట్టుబడుల వెనుక మంత్రి లోకేష్ కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో గూగుల్ సంస్థ నిర్వహించిన భారత్ ఏఐ శక్తి సదస్సులో పాల్గొన్న అనంతరం అమరావతికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ అంటూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలతో సీఎం చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు.

**ఏఐ డాటా సెంటర్‌తో విద్య, వైద్య, వ్యవసాయంలో కీలక మార్పులు:** ఏఐ డాటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలని నేతలకు సూచించారు. సామాన్యులకు సైతం డేటా సెంటర్ ప్రయోజనాలేంటో తెలిసేలా అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన ఈ భారీ పెట్టుబడి తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. '30 ఏళ్ల క్రితం ఐటీని ప్రోత్సహించినప్పుడు నాడు సమాజంలో ఆ రంగంపై ఇంత అవగాహన, చర్చ, పోటీ లేదు. కానీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఉన్న అవకాశాలను నాడు ఊహించి ప్రణాళికలు అమలు చేశాం. దీనికోసం అనేక విమర్శలను కూడా ఎదుర్కొన్నాం.

నాడు ముఖ్యమంత్రులు కంపెనీల కోసం విదేశాలకు వెళ్లి పెట్టుబడులు ఆకర్షించిన సందర్భాలు లేవు. అయితే విదేశాల్లో తిరిగి, దావోస్ పెట్టుబడుల సదస్సులకు వెళ్లి పరిశ్రమలు తెచ్చేందుకు పయత్నాలు చేశాం. అనేక ప్రయత్నాలతోనే హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ సహా అనేక కంపెనీలను తెచ్చి ఐటీకి పునాది వేశాం. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేసింది. అనేక కంపెనీలు రావడానికి నాడు మైక్రోసాఫ్ట్ కారణం అయ్యింది. నేడు విశాఖకు వస్తున్న గూగుల్ ఏఐ డాటా సెంటర్ పెట్టుబడి కూడా అంతే ప్రభావాన్ని చూపుతుంది. విశాఖను ఐటీ హబ్‌గా చేసేందుకు మనం చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో పెద్ద ముందడుగు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** వసతి గృహాలలో ఉన్న ప్రతీ ఒక్క విద్యార్థికి పూర్తి ఆరోగ్య పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో తాగునీటి వసతులు, సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖలతో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. మొత్తం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించుటకు ఎన్ని రోజులు పడుతుంది, తదనుగుణంగా ఏ రోజు ఏ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేది కార్యాచరణ తయారు చేయాలని అన్నారు. దీపావళి తరువాత ఈ కార్యక్రమంను చేపడతామని చెప్పారు. ప్రతీ వసతి గృహం తాగునీరు, పారిశుద్ధ్యం లోపం లేకుండా ఒక వ్యక్తిని బాధ్యులుగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. వసతి గృహాలలో ప్రతి అంశం పట్ల పూర్తి జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు. చెన్నయ్య, బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మయూరి, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గా భాయి, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కంపు... ప్రభుత్వానికి తలవంపు..!!

(మొదటి పేజీ తరువాయి)

గత పదేళ్ల నుంచి పరిశీలిస్తే ఏసీబీకి చిక్కిన ఎంత మంది అధికారులకు, సిబ్బందికి శిక్షణ పడ్డాయో వారికే తెలియాలి. ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ సిబ్బంది కేసు నుంచి బయటపడడానికి బాధితులతో సాక్షులతో, రాజీ పడుతున్నారు. దీనికి కొంతమంది ఉన్నతాధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ. కార్యాలయాల్లో పట్టాదారు పాసు పుస్తకాల కోసం కాళ్ల చెప్పులు అరిగేలా తిరుగుతున్న రైతులు ఎంతో మంది ఉన్నారు. పైసలిస్తేనే పాస్ పుస్తకం ఇస్తామంటూ విఆర్ఓ మొదలు రెవెన్యూ అధికారి వరకు బేరాలు పెట్టి లంచాల కోసం చేతులు చాస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రైతులు ఫిర్యాదు చేసినా వారికి రెవెన్యూ కార్యాలయాల్లో కాకుండా వీఆర్వోలు అడ్డుపడుతున్నారు. అన్ని జిల్లాలో లక్షలాది వందలాది మంది రైతులు పాసుపుస్తకాల కు దరఖాస్తు చేసుకుని వాటి కోసం ఎదురు డబ్బులు ఇస్తే పాస్ పుస్తకం ఇస్తున్నారు లేదంటే రోజుల తరబడి వీఆర్వోలు, సిబ్బంది, రెవెన్యూ కార్యాలయం అధికారులు తమ చుట్టూ రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది తనిఖీ చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా అనేక పాస్ పుస్తకాలు బయటపడతాయని కొంతమంది రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా తమకు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని, మ్యూటేషన్ జరగడం లేదని రైతులు ఏసీబీ అధికారులకు గతంలోఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇంతవరకు అవి కోటని ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు భూములు రీ సర్వే గ్రామాల్లో. రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలోని పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి ఎక్కువగా జరుగుతోందని, డాక్యుమెంటు రైటర్లు అధికారులకు ముడుపులు ముట్టచెప్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఏసీబీ అధికారులు దాడులు చేయాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉండగా

ప్రజలు ఫిర్యాదు చేస్తేనే ఏసీబీ దాడులు చేస్తుందని, లేకపోతే అంతా సవ్యంగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు భావిస్తున్నారని అనుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళ్లినపుడు అ?ధికారుల తీరుతో విసుగు చెందిన వారు ఫిర్యాదు చేస్తేనే ఏసీబీలో కదలిక వస్తోం ది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిన్నాచితక సిబ్బందిపై ఏసీబీ దాడులు జరుగుతున్నాయి పెద్ద చేపల పై వల వేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి ప్రజలు ఎవరైనా అవినీతిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తేనే తప్ప సొంతగా దాడులు చేసిన సందర్భాలు లేవు. ఒకవేళ ఎవరైనా అవినీతి పై ఫిర్యాదు చేస్తే తే గోప్యంగా ఉంచాల్సిన ఏసీబీ కార్యాలయ సిబ్బంది ముందుగానే లీకులు ఇస్తున్నారని పలువురు



చెబుతున్నారు.. అలాగని అవినీతి ఏమైనా తగ్గిందా? అంటే అదీ లేదు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎంత తీవ్రంగా ఉన్నదో ఫిర్యాదులే చెబు తున్నాయి.

**దాడులు చేస్తేనే.. :** మండలానికో ఏసీబీ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామని, ఫిర్యాదులకు దిశ యాప్ అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అవినీతి అంతం చేస్తామంటూ చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి.

బీరాలు పలుకుతోంది. అవినీతి లేని పాలన అందిస్తామని ప్రకటించారు. అవినీతిని నిర్మూలిస్తే అంతకంటే ఏం కావాలి? కానీ ఏసీబీకి అవినీతిపరుల చిట్టా తెలియదా? ఏ ఏ శాఖల్లో ఏ అధికారులు లంచాలు దిగమింగుతున్నారో సమాచారం లేదా? అసలు ఆ శాఖలపై నిఘా ఉందా? లంచాలు తీసుకునే వారికి భయం కలిగేలా ఏమైనా చేస్తున్నారా? అంటే సమాధానం లేదు. ఏసీబీ అధికారులు మాత్రం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఫిర్యాదు చేయడానికి నంబరు కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని, ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే దాడులు చేస్తున్నామని చెబుతున్నారు. ఇంత చేసి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తప్ప పట్టించుకోకపోతే ఏం లాభం అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**పని జరగాలంటే... :**

రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా చేతి చమురు వదలకుండా పని జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరికి ముట్ట జెప్పాల్సింది వారికి ఇవ్వకపోతే పని కావడం లేదని అంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో ఈ తీరు ఎక్కువ. చిన్న పని దగ్గరి నుంచి పట్టాదారు పాసు పుస్తకాల వరకు ప్రతి దానికి ఓ రేటు. అది ఇవ్వకోపోతే సంవత్సరాలు గడిచినా పని జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. కింది నుంచి పై దాకా ప్రతి ఒక్కరి చేయి తడపాల్సిందే. వ్యవసాయ భూముల పాసు పుస్తకాలకు ఎకరానికి ఇంత అని లెక్కగట్టి తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కొన్ని చోట్ల ఏసీబీ అధికారులు దాడులు చేసినపుడు మాత్రమే తూ తూ మంత్రంగా చేయి తడపడం ఆపుతున్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల. అనేక తహసీల్దార్ కార్యాలయాల్లో పంపిణీ కాని పాసు పుస్తకాలను గుర్తించినట్లు తెలుస్తోంది.. దీనిని బట్టి ఈ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. డబ్బులు ఇస్తేనే పాసు పుస్తకాలు ఇస్తున్నారని, డబ్బు ఇచ్చుకోలేని వారి పాసు పుస్తకాలు కార్యాలయాల్లో మగ్గిపోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. పాఠశాల పిల్లలకు అవసరమయ్యే సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫి కెట్లు.. ఇలా అన్నింటికీ కొంత మంది మండల రెవెన్యూ అధికారులు ధర ఇంత అని నిర్ణయించి లంచం తీసుకుం టున్నారన్న ఆరోపణలు ఎక్కువ గా వినిపిస్తున్నాయి.

**పర్సంటేజీ ప్రకారం.. :**

ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా ల్లో అవినీతికి అంతే లేదు. ఏదైనా అస్తికి సంబంధించిన క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేస్తే దానికి విలువలో ఇంత శాతం అంటూ తీసుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. రూ. పది లక్షల విలువ చేసే భూమి కొంటే కనీసం పదివేల రూపాయల సమర్పించుకోవాల్సిందే! ఈ వ్యవహారం డాక్యుమెంటు రైటర్ల చేతుల మీదుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వినియోగదారుల నుంచి వీరు తీసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అందజేస్తారు. దానిని సిబ్బంది అంతా పంచుకుం టున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారం చూసుకు నేందుకు రిజిస్ట్రేషన్ సిబ్బంది ప్రత్యేకంగా ఓ మనిషిని నియమిం చుకుంటు న్నారన్న అరోపణలు కూడా ఉన్నాయి. జిల్లాలో కొంతమంది సబ్ రిజిస్ట్రార్ల తీరును గమనించి ఆ శాఖ ఉన్నతాధికారులు సంవత్సర కాలంలో పలువురిని బదిలీ కూడా చేశారంటే ఈ శాఖలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేందుకు అనేకమంది రిజిస్ట్రార్లు పోటీ పడుతున్నారు. ఇందుకోసం ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున లంచాలు బుట్ట చెబుతున్నారు.

**సామాన్యుడికి వణుకే.. :**

న్యాయం కోసం పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కితే రక్షణ అటుంచి పోలీసుల తీరుతో సామాన్యులు వణికిపోతున్నారు. తమకు న్యాయం జరగడం లేదని పలువురు బాధితులు స్పందన కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్న దాఖలాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పలువురు బాధితులు చుట్టూ తిరిగి పనులు కాకపోవడంతో తరచూ అక్కడక్కడ ఆత్మహత్యాయత్నం చేస్తున్నారంటే పోలీసులు సామాన్యుల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో తెలుస్తోంది. ఫిర్యాదును స్వీకరించేందుకు కూడా లంచాలు అడుగుతున్నారని అన్ని జిల్లాల నుంచి ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఫిర్యాదు నమోదు చేయకుండా ఉండేందుకు కూడా అరోప ణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్థాయిని బట్టి లంచం వసూలు చేస్తు న్నారనే విమర్శలు ఉన్నాయి.

**ప్రతి శాఖలో ఇదే తీరు.. :**

అవినీతి ఏ ఒక్క శాఖకో పరిమితమైందనుకుంటే పొరబాటే. ఆదాయం ఎక్కువ ఉన్న ప్రతి శాఖలో డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. జనావాసాలు పెరుగుతుండటంతో ప్రతి చోట లే అవుట్లు వెలుస్తున్నాయి. వీటి అనుమతి పనులను ప్లానింగ్ విభాగం చూస్తుంది. లే అవుట్ విస్తీర్ణం చూసి, ఎకరాల చొప్పున ఇంత అని తీసుకుంటారు. పొలాలను సర్వే చేసే సర్వేయర్లది మరో లెక్క. డబ్బులను బట్టి సరిహద్దులు మారిపోతుంటాయి. వీరి తీరుతో సరిహద్దు వివాదాల్లో రెండు వర్గాల వారు సతమతమైన సందర్భాలు ఇలాంటి వ్యవహారాలు అనేకం ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రాంతంలో చూసినా మునుపెన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శి నుంచి భూమి కన్వర్షన్ చేసే రెవెన్యూ అధికారుల వరకూ పెద్ద ఎత్తున లంచాలు గుంజుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా ప్లాట్లు వేసిన వారి పై చర్యలు లేవు. ఆరోపణలు వచ్చిన చోట తనిఖీలు కూడా లేవు. జిల్లా నలుమూలల అక్రమ ప్లాట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంతమంది బ్రోకర్లు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ తూ అక్రమ పద్ధతిలో రియల్ వ్యాపారానికి ద్వారాలు తీస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇక రవాణా శాఖలో దళారులు లేకుండా పని జరగడం దాదాపు అసాధ్యమే! ఇవన్నీ అందరికీ తెలిసి జరుగుతున్న వ్యవహారాలే! ఇలాంటి అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపించాలని ప్రజానీకం కోరుతోంది. ఎక్కువ లంచాలు గుంజుతున్న ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించి ఏసీబీ అధికారులు తనిఖీలు చేయాలి. అంతేకాకుండా అధికారుల ఆస్తిపాస్తులు పై కూడా సుమోటోగా స్వీకరించి దాడులు చేసి అవినీతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

## గిట్టుబాటు ధరలపై రైతులకు అవగాహన

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**గిట్టుబాటు ధరలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ. చంద్రిక తెలిపారు. ఎదుగు లేదు.. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి రైతులు మిర్చిని తీసుకువచ్చి అమ్మకొని గిట్టుబాటు ధర పొందుచున్నారని చెప్పారు. అమ్మటం ఇష్టం లేని కొందరు రైతులు తమ సరుకును కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ వుంచడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతము గుంటూరు పట్టణం చుట్టుప్రక్కల కోల్డ్ స్టోరేజ్ లలో సుమారు 51,62,687 బస్తాలు మిర్చి సరుకు నిల్వ ఉందని పేర్కొన్నారు. మిర్చి ధరలు ఇతర దేశాలు - కొలంబో, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థాయ్ లాండ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక మొదలగు దేశాలకు ఎగుమతులు ఆర్డర్లపై ఆధారపడి వుంటుందన్నారు. 2023-24 సంవత్సరంలో ఎగుమతుల ఆర్డర్లు ఎక్కువ ఉండుట, నాణ్యత ఉండుట వలన ఆ సంవత్సరంలో ధరలు ఎక్కువగా ఉండటం జరిగిందన్నారు. ప్రస్తుతము ఎగుమతులు ఆశాజనకంగా లేనందున, దేశీయ మార్కెట్ లో స్థానిక మిర్చి దిగుమతులు ఎక్కువ వచ్చుచున్నందున ధరలలో మాంద్యం వస్తుందని పేర్కొన్నారు. 2023-24 సంవత్సరంలో మాత్రమే మిర్చి ధరలు వివిధ కారణాల వలన ఎక్కువగా వున్నవి తప్ప మిగిలిన సంవత్సరములలో ధరలు స్థిరముగా ఉన్నాయని ఆమె చెప్పారు. వేసవి సెలవులు అనంతరము రకముల వారిగా మిర్చి ధరలలో రూ. 1000/- ల నుండి రూ. 1500/- ల వరకు పెరుగుదల ఉందని చెప్పారు. ప్రస్తుతము గుంటూరు మార్కెట్ యార్డునకు రోజుకు సుమారు 55 వేల టిక్కీల వరకు అమ్మకానికి మిర్చి రావడం జరుగుతుందన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు గుంటూరు మార్కెట్ యార్డులో కొనుగోలు పెరుగుటకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరలను గమనిస్తూ సరైన గిట్టుబాటు ధరలకు తమ సరుకును అమ్ముకొనుటకు రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందని చెప్పారు.

## వైసీపీ నేతల తీరు హేయం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వైసీపీ నాయకుల మహిళలపై అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అది ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "వైసీపీ నాయకుల డిఎన్ఏలోనే మహిళల పట్ల గౌరవం, మర్యాద అనే విలువలు లేవు. ఎప్పటికప్పుడు మహిళలను కించపరిచే మాటలు, ప్రవర్తన కొనసాగుతోంది. మహిళలను ఓటు సాధనంగా మాత్రమే చూస్తున్నారు. ఎన్నికలప్పుడు అక్కచెల్లెమ్మలమని నటిస్తూ ఓట్లు అడిగి, ఆ తర్వాత వారిని అవమానపరచడం వైసీపీ నాయకుల సంస్కృతి అయిపోయిందని వ్యాఖ్యానించారు. బ్రాహ్మనాయుడు చేసిన ఈ వ్యాఖ్యలకు తక్షణమే రాష్ట్రంలోని ప్రతి మహిళకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే మహిళా లోకం తిరుగుబాటు తప్పదు" అని హెచ్చరించారు. కల్తీ మద్యం విక్రయాలతో మహిళల కుటుంబాలను నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ అదే విధంగా మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తోంది. ఇవి ప్రజా ప్రతినిధుల మాటలేనా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి," అని గళ్ళా మాధవి కోరారు. మహిళల గౌరవాన్ని కాపాడటం తమ బాధ్యతగా భావిస్తూ, ఇలాంటి నీచ వ్యాఖ్యలను ఇక భరించబోమని గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## పీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** కర్నూలు జిల్లాలో పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు పీఎం పర్యటన విజయవంతంగా, అడ్డంకులు లేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి పర్యటన అనేది రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశం. ప్రతీ విభాగం క్రమశిక్షణతో, సమయపాలనతో వ్యవహరించాలి. ప్రజల భద్రత, సౌకర్యం అత్యంత ప్రాధాన్యముగా ఉండాలని అన్నారు.
రవాణా సదుపాయాల సమర్థ నిర్వహణ, పోలీస్ యంత్రాంగం పర్యవేక్షణ, సభ నిర్వహణపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశం సందర్భంగా వాహనాల మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాధిపతులతో చర్చించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యం, సమయపాలనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి చిన్న అంశంలోనూ సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
తదనంతరం సహచార మంత్రులు, స్థానిక ఎంపీ, ఉన్నతాధికారులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మీడియా సెంటర్, వీఐపీ రూట్స్, అగ్నిమాపక సదుపాయాలు వంటి ఏర్పాట్లను పరిశీలించి సత్వరంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
పీఎం మోదీ గారి పర్యటన రాష్ట్రానికి అభివృద్ధి దిశలో మరొక మైలురాయి అవుతుంది. కర్నూలు జిల్లా ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఈ పర్యటనను ఘనవిజయం చేయాలని పిలుపునిచ్చారు.
సహచర మంత్రులు సత్యకుమార్ యాదవ్, టిజీ భరత్, నిమ్మల రామానాయుడు, రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నేతలతో ఏర్పాట్లను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు.

## వాటర్ టాంక్ చుట్టూ ప్రక్కల శుభ్రం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం వాటర్ టాంక్ చుట్టు ప్రక్కల శుభ్రం చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్ తెలిపారు. "అపరిశుభ్రంగా వీరనాయకపాలెం నీటి టాంక్ పరిసరాలు.
మంగళవారం ప్రచురితమైన వార్తపై ఆయన స్పందిస్తూ టాంక్ పరిసరాలలో పిచ్చి మొక్కలను 20 రోజుల క్రితమే శుభ్రం చేయించడం జరిగిందని, అయితే వర్షాలు ఎక్కువగా పడటం వలన వెంటనే గడ్డి మొలవడం జరిగిందన్నారు. ఆయా పరిసర ప్రాంతాలలో ఎక్కడ మురుగు నీరు నిలువ లేదని, వాటర్ ట్యాంకు ఇండ్ల మధ్యన ఉండటం, నిత్యం ప్రజల రాకపోకలు జరగటం వలన, అక్కడ ఎటువంటి మలమూత్ర విసర్జనలు జరగటం లేదని పేర్కొన్నారు. డోసింగ్ పంపు సహాయంతో రోజు క్లోరినేషన్, 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ కూడా చేయించడం జరుగుతుందన్నారు. పి. డబ్ల్యూ. ఎస్ పథకం చుట్టు ప్రక్కల సుందరంగా ఉంచటానికి కంచె, గేటు ఏర్పాటు చేయుటకు గ్రామ పంచాయతి తీర్మానం కూడా చేయడం జరిగిందని వివరించారు. దానిని త్వరలోనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించడం జరిగిందన్నారు.

# ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తిరుపతి, విశాఖపట్నంలను గుర్తించండి



**ఉదయ్ పూర్(జర్నలిస్ట్ ఫైల్):** దేశ పర్యాటక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత కేంద్ర సహకారం అందించాలని, కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారం ఏపీలోని తిరుపతి, విశాఖపట్నంలను ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ మారియట్ హెూటల్లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో జరుగుతున్న సమావేశంలో ఏపీ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడిచిన 15 నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ మిషన్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున విశాఖపట్నం, తిరుపతి లను ప్రధాన గమ్యస్థానాలుగా ప్రతిపాదిస్తున్నామని, ఈ ప్రాంతాలు తమ రాష్ట్ర వైవిధ్యాన్ని, సంసిద్ధతను, అంతర్జాతీయ ప్రమాణాలను ప్రతిబింబింపజేస్తాయని వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ 2025-26 పేరా సముద్రతీర, మెరైన్ గమ్యస్థానం గా విశాఖ,అధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
జాతీయ మిషన్ లక్ష్యాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించడానికి ఏర్పాటు చేసిన ఈ చారిత్రాత్మక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం గర్వంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.
ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024%-%29 నూతన పర్యాటక విధానం ప్రకటించిందని తద్వారా సమగ్ర, పెట్టుబడి-ఆధారిత విధానాన్ని అవలంబిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. గడిచిన 15 నెలల్లో దాదాపు రూ. 12,000 కోట్ల పర్యాటక పెట్టుబడులతో పాటు తాజ్, ఐటీసీ, ఒబెరాయ్, హిల్టన్, లెమన్ ట్రీ వంటి ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్లతో కూడిన 21 హెూటల్ మరియు రిసార్ట్ ప్రాజెక్టులను ఏపీకి వచ్చేలా ఆకర్షించామన్నారు. రూ. 4,500 కోట్లతో ఈ ప్రాజెక్టుల ద్వారా ఇప్పటివరకు 18,000 మందికి పైగా ఉద్యోగాలను సృష్టించామన్నారు. అంతేగాక గ్రామీణ,గిరిజన పర్యాటక సర్క్యూట్‌లలో 10,000 హెూమ్‌స్టేలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీకి ప్రత్యేకమైన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్ నర్ షిప్) నమూనా ద్వారా పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధిని ఏకీకృతం చేస్తున్నామని తెలిపారు. తద్వారా స్థానిక సంఘాలు, వ్యాపారవేత్తలు, అంతర్జాతీయ భాగస్వాములను ఒకే వేదికపై తీసుకువచ్చి కలిసి పని చేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. 2029 నాటికి పర్యాటక రంగం రాష్ట్ర జీవీఏలో వాటాను 4.6% నుండి 8%కు పెంచడం, 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించడం, 50,000 హెూటళ్లను ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. అంతేగాక తిరుమల పవిత్ర కొండలను మొదలుకొని విశాఖపట్నం సముద్రతీరాల వరకు, పచ్చని అరకు లోయ నుండి గోదావరి బ్యాక్ వాటర్స్, అమరావతి బౌద్ధ వారసత్వ క్షేత్రాల వరకు పర్యాటకులకు ఆధ్యాత్మిక, తీరప్రాంత, పర్యావరణ, ఆరోగ్య, సాంస్కృతిక,సాహస పర్యాటక అనుభవాలు అందిస్తున్నామన్నారు.

**విశాఖకు నూతన పర్యాటక శోభ:మంత్రి కందుల దుర్గేష్**

విశాఖపట్నాన్ని భారతదేశపు తొలి ఓషనేరియం, మెరైన్ ఎక్స్‌పీరియన్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని ఏపీ ప్రభుత్వం సంకల్పించినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, క్రూయిజ్ టెర్మినల్, భీమిలి-రుషికొండ పర్యాటక కారిడార్‌ను ఒక శక్తివంతమైన తీరప్రాంత హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను కాన్ఫరెన్స్ లో వివరించారు.

**అధ్యాత్మిక విద్య, వెల్‌నెస్, సాంస్కృతిక కేంద్రంగా తిరుపతి:మంత్రి కందుల దుర్గేష్**

తిరుపతిలో పవిత్ర కొండల అధ్యాత్మికతను విస్తరించే దిశగా, Spiritual Civilization Museum & Mythological Experience Park ను స్థాపించాలని యోచిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భారతీయ నాగరికత కథను డిజిటల్ డోమ్స్, లైవ్ క్రాఫ్ట్ పెవిలియన్లు, "వాక్ ఆఫ్ ఫెయిత్" ప్రొమెనేడ్ ద్వారా తిరుమల పవిత్రతను కాపాడుతూనే అధ్యాత్మిక విద్య, వెల్‌నెస్ , సంస్కృతికి కేంద్రంగా నిలుపుతామన్నారు.

**భారతదేశ వైవిధ్యాన్ని, ప్రపంచస్థాయి పర్యాటక అనుభవాలను అందించేవి ఈ రెండు ప్రాజెక్టులు: మంత్రి కందుల దుర్గేష్**


తీరప్రాంతం,ఆధ్యాత్మికం కలగవలసిన ఈ రెండు ప్రాజెక్టులు భారతదేశ వైవిధ్యాన్ని, ప్రపంచస్థాయి పర్యాటక అనుభవాలను సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ సామర్థ్యాన్ని తెలుపుతాయని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు వివరించారు. ఈ రెండు గమ్యస్థానాల చుట్టూ హెూటళ్లు, రిసార్ట్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, MICE మౌలిక సదుపాయాలను విస్తరించడానికి ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖలో కన్వెన్షన్ సెంటర్లు, వాటర్‌ఫ్రంట్ రిసార్ట్‌లు, క్రూయిజ్ టెర్మినల్స్, సాహస అనుభవాలను సమన్వయం చేస్తూ విశాఖ నగరాన్ని వ్యాపార, విహారయాత్రలకు కేంద్రంగా నిలుపుతామన్నారు. అదే విధంగా తిరుపతిలో ఆధ్యాత్మికతను కొనసాగిస్తూ, ప్రపంచ స్థాయి వెడ్డింగ్, వెల్‌నెస్ , సాంస్కృతిక వేదికలు ఏర్పాటు చేసి భారతదేశపు అగ్రగ్రామి గమ్యస్థానంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ద్వారా ఆర్థిక వృద్ధిని వారసత్వ సంస్కృతితో, ప్రైవేట్ వ్యాపారాన్ని ప్రజల భాగస్వామ్యంతో, ఆధునిక సాంకేతికతను సాంప్రదాయ విలువలతో మిళితం చేస్తామని తెలిపారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ మద్దతుతో ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశపు ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా మాత్రమే కాక, 2030 నాటికి ఆసియాలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలలో ఒకటిగా నిలుపుతామని మంత్రి కందుల దుర్గేష్ ఘంటాపథంగా తెలిపారు. కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఏపీ పర్యాటక రంగం అద్భుత పురోగతి సాధిస్తుందని వెల్లడించారు. జాతీయ మిషన్ రూపకల్పనలో భాగంగా తాము ఏపీ పర్యాటక గమ్యస్థాన అభివృద్ధిపై దృష్టి పెడతామని టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట అన్నారు. చివరి మైలురాయి వరకు కనెక్టివిటీ, సౌకర్యాలు, సూచికలు, పారిశుధ్యం, ఎలక్ట్రిక్ వాహన రవాణా మరియు డిజిటల్ విజిటర్ సిస్టమ్స్‌ను మెరుగుపరుస్తుందని తాము భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అవసరమైన ల్యాండ్ పార్సెల్స్, పెట్టుబడి ప్రతిపాదనలు, శిక్షణ పొందిన మానవ వనరులు, శక్తివంతమైన పాలనా వ్యవస్థతో ఏపీ సిద్ధంగా ఉందని తెలిపారు.

# చరిత్ర పుటల్లో ఈ రోజు సువర్ణాక్షరాల రోజుగా చిరస్మరణీయంగా నిలిచిపోతుంది



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్టణంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు పై మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో ఎంఓయు కుదుర్చుకోవటం రాష్ట్రాభివృద్ధిలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలుస్తుందని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోణుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. నగరంలోని బందరు రోడ్డులోని ఠాగూరు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ యంగెస్ట్ స్టేట్ గా ఉన్న నవ్యాంధ్రప్రదేశ్ ఇప్పుడు దేశంలో హై ఇన్‌వెస్ట్‌మెంట్ స్టేట్ గా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఒకవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరోవైపు మంత్రివర్యులు నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. దాదాపు 12 నెలలు పాటు శ్రమించి, జాతీయ పాలసీల్లో కూడా మార్పులు చేయించి, 2 లక్షల మందికి ఉపాధి కల్పించి, రూ. 1.33 పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల ఎఫ్ డీఐను సాధించడం ఇదే తొలిసారి అని అన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రావడంతో టెక్ అభివృద్ధికి ఎలా గేమ్ చేంజర్ అయిందో, అలా ఇప్పుడు గూగుల్ విశాఖకు రావడం రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి గేమ్ చేంజర్ మారనుందన్నారు.
అభివృద్ధి వికేంద్రీకరణను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలు విపక్షానికి బుద్ధి చెప్పినా కూడా వారి సైకో చేష్టలు మానుకోకుండా రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటం నిజంగా దుర్మార్గంగా అభివర్ణించారు. వారి స్కాంలు డైవర్ట్ చేయడానికి ఇప్పుడు తప్పుడు మార్గాలు ఎంచుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రజలు కూడా ఇలాంటి పార్టీల సైకో చేష్టలను నమ్మే పరిస్థితుల్లో లేరని వాళ్ళు గుర్తుంచుకోవాలని చైర్మన్ కోటేశ్వరరావు తెలియజేశారు.

# వైసీపీ నేతల దౌర్జన్యంపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం మజరా బాలినాయినిపల్లి గ్రామానికి చెందిన రఘు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో సర్వే నెంబర్ 810 లోని 0.05 సెంట్ల స్థలం గత 40 సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉంచుకొని కుటుంబంతో నివసిస్తూ తన కులవృత్తి అయిన చాకలి వృత్తితో జీవనం సాగిస్తున్నాను. అయితే 2023 సంవత్సరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు రాజకీయ కక్షతో కుట్ర పన్ని తన ఇంటిని కూలదోసి తన భార్య, పిల్లలను వీధి బాట పట్టించారు. జీవించడానికి మార్గం లేక బాడుగ ఇంట్లో నివసిస్తున్నాను. మదనపల్లి ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తే ఆయన సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు సర్వే చేయడానికి ప్రయత్నించగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మళ్లీ దౌర్జన్యానికి పాల్పడి సర్వేను అడ్డుకుంటున్నారు. కావునా వారిపై చర్యలు తమ సమస్యను పరిష్కరించాలని నేతలు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, గుంటూరు జిల్లా డీసీఎమ్ఎస్ చైర్మన్ వడ్రానం హరిబాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.
పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కుటుంబ భవిష్యత్తు కోసం 2015 సెప్టెంబర్ 8న ఉద్యోగం కోసం కువైట్ దేశానికి వెళ్లాను. అయితే అక్కడకు చేరుకున్న తర్వాత వాగ్దానం చేసిన ఉద్యోగం ఇవ్వకపోగా బలవంతంగా తక్కువ వేతనంతో దారుణ పరిస్థితుల్లో పని చేయిస్తున్నారు. పాస్‌పోర్ట్‌ను యజమానులు స్వాధీనం చేసుకొని తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరింపులకు గురి చేస్తున్నారు. తిండి, నివాసం లేక తీవ్ర ఇబ్బందుల్లో రోజులు గడుపుతున్నాను. పైగా స్థానిక పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కావునా తక్షణ చర్యలు తీసుకోని స్వదేశానికి వచ్చేలా సాయం చేయాలని కోరాడు.
పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామానికి చెందిన యస్.సి., యస్.టి., బి.సి. రైతులు సర్వే నెం. 504/33 YL నందు ఉన్న య. 115.46 సెంట్ల చుక్కల భూమిలో గత 50 సంవత్సరాలుగా సాగు చేస్తూ ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తున్నాం. ఆర్.ఎస్.ఆర్. రిజిస్టర్ ప్రకారం చుక్కల భూమిగా నమోదై ఉంది. గతంలో సదరు సర్వే నెంబరులోని య. 26.58 సెంట్లకు పట్టాలు జారీ కాగా, ఇంకా య. 88.88 సెంట్లు నిల్వ భూమిగా ఉంది. భూమిపై ఎటువంటి ఆక్షేపణలు లేకుండా సాగు చేస్తున్నందున సదరు భూమిని కొలిచి పట్టాదారు పాస్‌బుక్స్, పట్టాలు జారీ చేయాలని కోరారు.
ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం రామపురం గ్రామానికి చెందిన సురేష్ బాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత పంచాయితీ ఎన్నికలలో టీడీపీ తరపున పోటీ చేసినందుకు వైసిఆర్‌సిపి అనుచరులు కక్షతో తమ ఇంటికి వెళ్లే దారిని పూర్తిగా మూసివేశారు. ఈ దారి తమ కుటుంబం కలిసి వదులుకున్న మార్గం. ఎన్నిసార్లు అధికారులు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దారి లేకపోవడంతో తను ఆ ఇంటిని వదిలి వేరొక ఇంట్లో నివాసం ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు నీటి కాలువ సమస్యతో పొరుగువారి పంటలు నాశనం అవుతుండగా అదే కారణంగా తనపై అక్రమ కేసు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.
వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ విస్తృత తనిఖీలు



**గుంటూరు, ( జర్నలిస్ట్ ఫైల్):**విద్యుత్ చౌర్యాలను అరికట్టే క్రమంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ మరియు ఆపరేషన్ విభాగాలు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాయి. గుంటూరు పర్యవేక్షక ఇంజనీర్ చి. రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు సెక్షన్ పరిధిలో ఈ తనిఖీలు జరిగాయి.
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు ఎస్.ఏ. కరీమ్, టి. శ్రీనివాసబాబు సంయుక్త ప్రకటనలో తెలిపారు మొత్తం 54 బృందాల్లో 54 మంది అధికారులు, 174 మంది సిబ్బంది పాల్గొని 4,406 సర్వీసులను తనిఖీ చేశారని. ఈ క్రమంలో మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగించిన ఇద్దరికి రూ. 30 వేల రూపాయలు, అనుమతించిన లోడ్ కంటే ఎక్కువ విద్యుత్ వాడిన 19 మందికి రూ. 1.45 లక్షల రూపాయలగా కలిపి రూ. 1.75 లక్షల అపరాధ రుసుము విధించడమైనట్లు వివరించారు.
తనిఖీలు భారత విద్యుత్ చట్టం ప్రకారమే జరుగుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు. వినియోగదారులు తమ ప్రాంగణంలో ఉన్న మీటర్ల తప్పనిసరిగా సీల్స్‌తో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, అవి లేకపోతే లేదా తుప్పుపట్టినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా తీరప్రాంత ప్రాంతాల మీటర్ల సీల్స్ త్వరగా పాడైపోయే అవకాశం ఉండడం వల్ల తరచుగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.
సీలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించడం లేదా గాట్లు పెట్టడం విద్యుత్ చౌర్యంగా పరిగణించి, భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం కేసులు నమోదు చేస్తారని అధికారులు హెచ్చరించారు. మొదటిసారి తప్పిదానికి కంపౌండింగ్ పద్ధతిలో జరిమానా కట్టినవారిని కేసు నుండి విడిచిపెడతారు. రెండోసారి తప్పిదం చేస్తే అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపించి కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.
ఈ తనిఖీల్లో ఆపరేషన్ విభాగం డీఈఈ ఎన్. గురవయ్య, విజిలెన్స్ డీఈఈలు ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, ఎస్. శ్రీనివాసరావు, కె. రవికుమార్, ఆపరేషన్ ఏఈఈ ఎస్. శ్రీనివాసరావు, విజిలెన్స్ ఏఈఈలు ఉ. శివశంకర్, కె. కోటేశ్వరరావు, ఎం. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డి. నేలటూరు ఎస్సీ కాలనీని ఆదుకోవాలి

**బ్రహ్మంగారిమఠం ( జర్నలిస్ట్ ఫైల్):**మండలంలోని డి. నేలటూరు ఎస్సీ కాలనీలో నీరు చేరి ప్రజలు నివసించేందుకు ఇబ్బందిగా ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని దిగువ నెలటూరు ఎస్సీ కాలనీకి పై భాగాన తాతప్ప చెరువు ఉండటం వలన చెరువులో నీళ్లు ఉంటే చెరువు క్రింద ఉన్న ఎస్సీ కాలనీలోకి నీరు ఊటగా వచ్చి ఇళ్లకు ఇబ్బందికరంగా ఉందని ప్రజలు నివసించేందుకు ఇబ్బంది పడుతూ ఊట నీరు ఇళ్లలోకి సైతం ప్రవేశించడంతో బేస్మెంట్ పూర్తిగా దెబ్బతిని కూలిపోయే ప్రమాదం ఉందని ఎప్పుడు కూలిపోతాయో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారని, అదేవిధంగా ఆ మురికి నీరుతో ప్రజలు చిన్నపిల్లలు వృద్ధులు సైతం విషజ్వరాలు రోగాలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి ఎస్సీ కాలనీ ప్రజలకు పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయ నాయకులు గ్రామాల్లో పర్యటించి ఓట్ల కోసం మాత్రమే ప్రజలను వాడుకుంటున్నారు తప్ప ఇటువంటి సమయంలో ఏ ఒక్క రాజకీయ నాయకుడు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు

## గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం రాష్ట్రానికి శుభ పరిణామం - హెూం మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ఎంతో గర్వకారణమని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలవనుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉత్తరాంధ్ర ప్రాంతం ప్రపంచ పటంలో గుర్తింపు పొందబోతోందని, ఈ కేంద్రం ద్వారా సుమారు 1.88 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి అని పేర్కొన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ అభివృద్ధికి బాటలు వేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ సమయంలో మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఇప్పుడు విశాఖను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయడంలో చంద్రబాబు దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. గూగుల్‌ను విశాఖకు తీసుకురావడం పెద్ద విజయం అని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర వాసిగా ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని, విశాఖను ఐటీ హబ్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు మంత్రి అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**

యువతలో కళా నైపుణ్యం, జాతీయభావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లాస్థాయి యువజ నోత్స వాలు జరగనున్నాయని.. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశమందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి యువజనోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడ ుతూ విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు జరగను న్నాయని.. 2025, సెప్టెంబర్ 1 నాటికి 15–29 ఏళ్ల వయసు కలిగిన, జిల్లాస్థా నికత ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వికసిత్ భారత్ జిల్లా స్థాయి – కల్చరల్ అండ్ ఇన్నొవేషన్ ట్రాక్ విభాగంలో ఫోక్ డ్యాన్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పొయెట్రీ, డిక్లమేషన్, ఇన్నొవేషన్ అంశాల్లో పోటీలు నిర్వహించ నున్నట్లు జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు తెలిపారు. ఔత్సాహికులు https://short-url.org/1gYpz లింక్ ద్వారా ఈ నెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23వ తేదీ ఉదయం పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి విజేతలు, జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9949522694, 9032115987 నంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

## అఖిలభారత యోగా పోటీలకు కేబీఎన్ విద్యార్థులు

**విజయవాడ పశ్చిమ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**



కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాల యోగ పోటీలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అఖిల భారత పోటీలకు ఎంపికైనట్లు కె.బి.ఎన్. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. సోమవారం కాలేజీలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 10వ తేదీన విజయవాడ పి.బి. సిద్ధార్థ కాలేజీలో యూనివర్శిటీ స్థాయి పోటీలు జరిగాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎండి. జీబా తహరీమ్ (ఫైనల్ బి ఎస్ సి బయో టెక్నాలజీ), ఎస్.కె. సమీరా (ఫైనల్ బి ఎస్ సి బయోటెక్నాలజీ), ఏం రాకేష్ (సెకండ్ బీఎస్సీ ఎలక్ట్రానిక్స్), ఇ. నాని కృష్ణ చైతన్య (సెకండ్ బీఎస్సీ డేటా సైన్స్), పి సత్యప్రసాద్ రాజు (డిప్లమా ఇన్ యోగ), వి. కుమార్ రాజు (సెకండ్ బీకాం కంప్యూటర్స్) అఖిల భారత పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబరులో ఎస్వీ వ్యాస యూనివర్శిటీ (బెంగళూరు)లో జరిగే పోటీల్లో మహిళల జట్టు, వేల్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (చెన్నై) లో జరిగే పోటీల్లో పురుషుల జట్టు పాల్గొంటున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావు, యోగా ట్రైనర్ వై.కె.ఎస్.డి. గౌరీనాథ్ లను అభినందించారు.

## జీఎస్టీ సంస్కరణలతో వాణిజ్య రంగానికి కొత్త ఊపు

- సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకూ ఎంతో మేలు
- విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**



సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ అర్బన్ పరిధిలో సాంబమూర్తి రోడ్డు, గాంధీనగర్ ప్రాంతంలో గిగ్ వర్కర్లతో ఏర్పాటుచేసిన బైకు ర్యాలీని విజయ వాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనస భ్యులు మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో వ్యాపార వాణిజ్య రంగాలకు కొత్త ఊపు వచ్చిందని.. వినియోగదారులకు పెద్దఎత్తున ప్రయోజనాలు లభిస్తు న్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0తో ఇటు వ్యాపారులు, అటు వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గిగ్ వర్కర్ల బైకు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సాంబమూర్తి రోడ్డు నుంచి మాచవరం ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సభా ప్రాంగణానికి చేరింది. గిగ్ వర్గానికి సూపర్ జీఎస్టీ ద్వారా కలుగుతున్న ప్రత్యక్ష ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడమే కాకుండా, కార్మిక వర్గానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు వివరాలను కార్యక్రమంలో తెలియజేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఆన్‌లైన్ ఆర్డర్లు పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక శాఖ జోన్–2 సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి, ఉప కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి, కార్మిక శాఖ అధికారులు టి.రాజేష్, జీవీ సారథి, కె.రాజకుమారి, వీఎన్ బిందు, కె.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, ర్యాపిడో తదితర ఆన్‌లైన్ వేదికల గిగ్ వర్కర్లు పాల్గొన్నారు.

## హనుమాన్ జంక్షన్ సీఐ కార్యాలయంలో ఉద్యోగుల పనిభారంపై నిరసన

**గన్నవరం, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**



పోలీసులు మనుషులే కదూ వీళ్లకు సెలవులు ఉండవా హనుమాన్ జంక్షన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం వేలే రోడ్డులో ఉంటున్న కార్యాలయంలో గత నెల రోజుల నుంచి ఇన్స్పెక్టర్ పోస్టు భర్తీ కాలేదు గన్నవరం సీఐ ఇన్చార్జిగా వ్యవహరిస్తు న్నాడు. వీరికి పండగ ,పబ్బం అనేవి ఉండవు. ఉదయం ఏడు గంటలకు ఒక మనిషి వచ్చి ఆఫీసు శుభ్రం చేసి వెళు తుంది. ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 9 గంటల వరకు ఒక్కొక్కసారి పది అవుతుంది ఆఫీసులోనే ఉంటున్నారు ఒక వ్యక్తి అయినా. ఇది 17 సంవత్సరాల నుంచి నేను పక్కనే ఉంటున్న నాకు తెలుసు ఈ విషయం. పోలీసులకు మానవ హక్కులు ఉండవ వాళ్లు పని చేసే మరమనుషులు ఆదివారాలు సెలవులు ఆవిరి అయిపోయాయి! ఇకనైనా ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి. సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి తగిన సిబ్బందిని నియమించి వాళ్లకు కూడా సమయపాలన ఉండే విధంగా చేయాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలి

- అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- పీజీఆర్ఎస్‌కు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు హాజరైన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం లభిం చేలా కృషి చేయాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనం తరం కలెక్టర్ మాట్లాడుతూ... పీజీఆర్ఎస్ అర్జీదారుల తో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని చెప్పారు. సరైనవిధంగా ఎండార్స్మెంట్లు ఇవ్వాలని, అర్జీదారులతో అధికారుల ప్రవర్తన విషయంలో మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పనిచే యాలని సూచించారు. మార్గదర్శకాలు పాటించడంలో ప్రవర్తన పరంగా కొందరు అధికారులలో లోపాలు కనిపిస్తున్నాయని వీటిని సరిదిద్దుకోవాలన్నారు. వీటిని సరిదిద్దుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదుల ఆడిటింగ్ సక్రమంగా పూర్తి చేయాలని, సమస్య పరిష్కార అధికారి (గ్రీవెన్స్ రెడ్రెస్సల్ అథారిటీ) స్వయంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి ఫీడ్ బ్యాక్ ను నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారికి సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతి ష్టాత్మక పీజీఆర్ఎస్ కార్యక్ర మాని కి గైర్హాజరైన అధికారు లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాల ని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశిం చారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 153 అర్జీలు: సోమవారం నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో మొత్తం 153 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖ కు సంబంధించి అత్యధికంగా 52 అర్జీలు, విజయవాడ నగరపాలక సంస్థకు 19, పోలీస్ 18, డీఆర్‌డీఏ 10, పంచాయ తీరాజ్ శాఖ 9, రవాణాశాఖకు 8, ఆరోగ్యశాఖకు ఏడు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం. లక్ష్మీ నరసింహం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జీఎస్టీ 2.0 దోహదం





- జీఎస్టీ సంస్కరణలతో ఎంఎస్ఎంఈల్లో నూతనుత్తేజం
- డబుల్ ఇంజిన్ సర్కారుతో సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి
- గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జీఎస్టీ 2.0 సంస్కరణలు చోదక శక్తిగా నిలుస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సోమవారం నగరంలోని పున్నమిఘాట్ వద్ద ఎంపీ కేశినేని శివనాథ్.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ తదితరులతో కలిసి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందుతోందని.. జీఎస్టీ సంస్కరణలతో వాణిజ్య, వ్యాపార రంగాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయన్నారు. జిల్లాలో 67 శాతం వాటా కలిగిన సేవారంగం మరింత అభివృద్ధికి ఈ జీఎస్టీ సంస్కరణలు దోహదం చేస్తాయన్నారు. నగర ప్రజలు ఈ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. రోజువారీగా మనం ఉపయోగించే అనేక వస్తువులపై జీఎస్టీ బాగా తగ్గిందని.. జీఎస్టీ తగ్గుదల తో జరుగుతున్న ఆదా ను పండగలా జరుపుకుం టున్నామని, రాష్ట్రంలో దాదాపు 50 వేల సమావేశాల ద్వారా ప్రజలకు పెద్దఎత్తున జీఎస్టీ 2.0 ప్రయోజ నాలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

**ప్రత్యేక ఆఫర్లు, లక్కీడ్రాలతో షాపింగ్ ఫెస్టివల్ : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే క్రమంలో సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు జరిగే గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌కు ప్రజలు వచ్చి.. ఎంచక్కా షాపింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో రోజువారీ లక్కీడ్రాలతో పాటు మెగా డ్రా తీయడం జరుగుతుందని.. వ్యాపార, వాణిజ్య సంస్థలు కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయన్నారు. సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ. 8 వేల కోట్లు, ప్రతికుటుంబానికి నెలకు రూ. 6 వేలు నుంచి రూ. 12 వేల వరకు ఆదా అవుతుందని వివరించారు. సామాన్యులకు ఎంతో మేలు జరుగుతోందని.. స్థూల విలువ జోడింపు (జీవీఏ), తలసరి ఆదాయం పెరుగుద లకు ఈ సంస్కరణలు దోహదం చేస్తాయన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో అది 18 శాతానికి తగ్గిందన్నారు. సబ్బులు, టూత్‌పేస్టులు, వంటనూనెలు, డిటర్జెంటులు వంటి నిత్యావసర ఎఫ్ఎంసీజీ వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది 5 శాతానికి తగ్గిందని వివరించారు. బీమా, ఆరోగ్య పాలసీలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది నేడు సున్నా శాతం అయిందన్నారు. ఈ ప్రయోజనాలను ప్రజలకు వివరించే క్రమంలో ఈ షాపింగ్ ఫెస్టివల్‌ను ఏర్పాటుచేశామని.. ఈ ఫెస్ట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఫుడ్ స్టాళ్లు, ఫన్ గేమ్స్ వంటివి ఉంటాయని వివరించారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఈ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని కోరారు. గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ ఈ నెల 19వ తేదీ వరకు జరగనుండగా.. ఫెస్టివల్‌లో ఏర్పాటుచేసిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో పాటు కార్లు, బైకులు తదితర వాహనాల స్టాళ్లు, స్థానిక హస్తకళాకారులు, లీడ్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుచేసిన స్టాళ్లను అతిథులు సంద ర్శించారు. షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్ర మంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుక ున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, జిల్లా పరిశ్ర మల అధికారి పి.మధు, డీఈవో యూవీ సుబ్బారావు, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు లక్ష్యం

- రైతుకు కనీస మద్దతు ధర అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు




**విజయవాడ, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రం లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో భారత ప్రభుత్వం ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. నగరంలోని పటమట యనమలకుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాల యంలో సోమవారం భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయిం చిన కనీస మద్దతు ధర రైతుకు అందించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ఏడాది ఖరీఫ్ లో 15.92 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కొనుగోలు చేసామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. ఎఫ్ సీఐ నుంచి పంజాబ్ రాష్ట్రం తర్వాత 14 లక్షల టన్నుల బియ్యాన్ని 10 % బ్రోకెన్ తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండవ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ధాన్యం కొనుగోలు పెంచాలని కోరటం జరిగిందని, దానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని పెంచిందన్నారు. గత రబీ సీజ్ లో 9.93 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది రబీలో కొనుగోలు లక్ష్యాన్ని పెంచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసాయని దాంతో పంట గిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పల్నాడు జిల్లాల్లో గిడ్డంగుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తే కొత్త వాటిని భారత ఆహార సంస్థ నిర్మించేందుకు తమ సంసిద్ధతను తెలియజేసిందన్నారు. భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో సోలార్ విద్యుత్ కు 45 మెగా వాట్స్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లానెల్స్ పెట్టుకోగల అవకాశం కలిగి ఉందని వివరించారు. పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ: భారత ఆహార సంస్థ ద్వారా ప్రతి నెలా 1.54 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ అవుతుందన్నారు. ఫోర్టిఫైడ్ రైస్ ను రాష్ట్రంలో 24.47 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం క్రింద, మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 55,746 అంగన్వాడీ కేంద్రాలకు ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తొలుత నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఆహార సంస్థ కొనుగోలు, నిల్వ, పంపిణీ కార్యకలాపాలపై కమిటీ సభ్యులు, అధికా రులతో చైర్మన్ చర్చించారు. రైతులకు ప్రభుత్వం కల్పిం చిన కనీస మద్దతు ధర ప్రయోజనం కల్పించేలా, ప్రజల కు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రయోజనం చేకూర్చే విధంగాను సమీక్షించారు. కమిటీ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, భారత ఆహార సంస్థ ఏపీ రీజనల్ జనరల్ మేనేజర్ విజయ కుమార్ యాదవ్, సివిల్ సప్లైస్ అధికారులు, భారత ఆహార సంస్థ అధికారులు, భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో తిష్టకు ఆఫ్రికన్ల కొత్త ఎత్తుగడలు

- నేరాలకు పాల్పడి, కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకుని జైళ్లకు వెళుతున్న వైనం
- కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కి పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు




**హైదరాబాద్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత్‌లో తిష్టవేసేందుకు ఆఫ్రికాదేశాలకు చెందినకొందరునేరగాళ్లు కొత్తఎత్తుగడలు వేస్తున్న తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేస్తోంది. ఇక్కడ అక్రమంగా ఏళ్లతరబడి వుంటున్న అనేక మంది ఆఫ్రికన్ నేరగాళ్లు ఇందుకోసం చిన్నా చితక నేరాలతో పాటు, ఇతరులతో అనవసరంగా గొడవలు పడి పోలీసు కేసుల్లో అరెస్టయి జైళ్లకు వెళుతుండడంతో పాటు కాంట్రాక్ట్ వివాహాలు చేసుకుని అమ్మాయిలను మోసం చేస్తున్నారు. ఈ కారణాలవల్ల వీసా గడువుముగిసినా కోర్టులో కేసులుండడంవల్ల వీరిని పోలీసులు వెనక్కు పంపలేక పోతున్నారు. ఆఫ్రికా దేశాలలో బతుకు పోరాటం నరకంగా వుండడం వివిధ కారణాల చేత భారత్‌కు వస్తున్న ఆఫ్రికన్లలో అనేక మంది తిరిగి వెళ్లేందుకు మనస్సు అంగీకరించక ఇక్కడే తిష్ట వేస్తున్నట్లు పోలీసులుచెబుతున్నారు.

ఆఫ్రికా దేశాలకు చెందిన వందలాది మంది భారత్‌లో అక్రమంగా వుండడం, వీరిలో 90 శాతంమంది నేరచరిత్ర కలిగి వుండడం పోలీసులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఒకప్పుడు నైజీరియాకు చెందిన కొందరు నేరగాళ్లు మాత్రమే భారత్‌లో అక్రమంగా వుండగా ఇప్పుడు ఈ జాబితాలో ఉగాండ, జాంబియా, కెన్యా సహా మరికొన్ని దేశాలకు చెందిన వారు కూడా చేరారు. ఆఫ్రికా దేశాలలో అంతర్గత సంక్షోభ సమస్య అధికంగా వుండగా, తీవ్రమైన కరువు కాటకాలు మరింత కుంగదీస్తోంది. దీంతో పాటు ఉగ్రవాద సమస్య అక్కడి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనికి తోడు జాతుల సమస్యలతో సాగుతున్న మారణకాండ అక్కడి ప్రజల బతుకులను మరింత దుర్భరంగా మారుస్తోంది. ఈ క్రమంలో భారత్ సహా అనేక దేశాలకు వలస వెళుతున్న ఆఫ్రికన్లు ఆతరువాత అక్కడే వుండేందుకు మక్కువ చూపుతున్నారు. ఇందులో భారత్ వుండేందుకు మరింత ఎక్కువ మంది ఇష్టపడుతున్నారని పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఇలావుంటే ఆఫ్రికన్ల వల్ల భారత్‌లోని అనేక నగరాలలో డ్రగ్స్ కల్చర్ బాగా పెరిగిందని నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. ఆఫ్రికా దేశాల నుంచి తక్కువ ధరకు నాణ్యమైన కొకైన్ సహా హెరాయిన్, ఎల్‌ఎస్‌టి వంటి డ్రగ్స్‌ను భారత్‌కు తెస్తూ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతూ అనేక మంది ఆఫ్రికన్లు జల్సా జీవితం గడుపుతు న్నారు. వీరంతా దక్షిణాదినగరాలైన హైదరా బాద్, బెంగళూరు, చెన్నైతో పాటు పశ్చిమాది నగరాలు ముంబాయి. గోవాలలో ఎక్కువగా తిష్ట వేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, బెంగళూరు, గోవా పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్ల వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు వున్నట్లు తేలింది. ఇదంతా డ్రగ్స్ స్మగ్లింగ్ వల్లే వీరు సంపాదించి నట్లు వెల్లడయ్యింది. డ్రగ్స్ కేసుల్లో అరెస్టయిన వారిలో 90శాతం నేరగాళ్లు వీసా గడువు ముగి సినా ఇక్కడే వుండడంతో పాటు మరికొందరు తప్పుడు పత్రాలతో వుంటున్నట్లు తేలింది.

**కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కు పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు**

ఇదిలావుండగా నిందితులుగావుంటూ ఏళ్లతరబడి భారత్‌లో అక్రమంగా వుంటున్న ఆఫ్రికన్లను బలవంతంగా వారిదేశాలకు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. వీరిపై వున్న కేసులను వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లుగా తెలిసింది. చిన్నాచితక కేసులను కోర్టులో వీలైనంత త్వరగా పరిష్కరించి ఇందులో నేరగాళ్లుగా వున్న ఆఫ్రికన్లను వారి దేశాలకు బలవంతంగా వంపేందుకు కేంద్రం చేబట్టిన చర్యలు కొంతమేర ఫలితాలు ఇస్తున్నాయి. హైదరాబాద్ సహా పలునగరాలలో అక్రమంగా వుంటున్న వంద మంది వరకు ఆఫ్రికన్ల కేసులను మూడు నెలల క్రితం ఆయా రాష్ట్రాల పోలీసులు ఓ కొలిక్కితెచ్చి వారిని వారి దేశాలకు పంపడం కొసమెరుపు.





# గూగుల్‌కు పోటీగా మ్యాపుల్స్

## యాప్ అద్భుతంగా ఉందన్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 14 :** ప్రపంచవ్యాప్తంగా నావిగేషన్ కోసం విరివిగా ఉపయోగించే గూగుల్ మ్యాప్స్‌కు గట్టి పోటీనిచ్చేలా ఓ స్వదేశీ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచింది. గూగుల్ కన్నా మెరుగైన ఫీచర్లతో భారతదేశంలో తయారైన మ్యాపుల్స్ నావిగేషన్ యాప్ అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కొనియాడారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా వాడాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. తాను స్వయంగా మ్యాపుల్స్ యాప్‌ను ఉపయోగిస్తున్న వీడియోను పంచుకున్నారు. ఈ యాప్‌లో ఫ్లైఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిలను సులభంగా గుర్తించవచ్చుని, అపార్ట్‌మెంట్‌లలో ఉండే దుకాణాల వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని ఆయన వివరించారు. ఇందులో 13 రకాల ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని, ఇవి ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయని తెలిపారు. మంత్రి చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గామారింది. స్వదేశీ యాప్‌కు కేంద్రమంత్రి ప్రచారం కల్పించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మ్యాపుల్స్ యాప్‌ను మ్యాప్‌మైఇండియా సంస్థ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లో 3డి జంక్షన్ వ్యూ, లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ టైమర్లు, భద్రతా హెచ్చరికలు, ప్రాంతీయ భాషల సపోర్ట్‌వంటి అనేక ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా భారతీయ రోడ్లు, జంక్షన్ల పరిస్థితులకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థతెలిపింది. మంత్రి ట్వీట్‌కు స్పందించిన మ్యాప్ మై ఇండయా సంస్థ ఆయనకు కృతజ్ఞత తెలిపింది. భారత్‌లో డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా, సులభంగా మార్చడమే తమ లక్ష్యమనిపేర్కొంది. దేశ ప్రజలందరూ స్వదేశీ సాంకేతిక విప్లవంలో భాగస్వాములు కావాలని కోరింది. ఇప్పటి వరకు ఈ యాప్‌ను 3.5 కోట్ల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.

# శ్రేసన్ ఫార్మాకు లైసెన్స్ రద్దు

## కోల్డ్‌రిఫ్ దగ్గుమందుతో పలు మరణాలు

### కంపెనీ మూసివేతకు తమిళనాడు సర్కారు ఆదేశాలు

**చెన్నై, అక్టోబరు 14 :** 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికిపైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులు రద్దు చేసినట్లు సోమవారం తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే కంపెనీ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. సరైన తయారీ పద్ధతులు అవలంబించడంలేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను అరెస్టు చేసింది. అలాగే సోమవారం ఉదయం ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఇడి తనిఖీలు నిర్వహించింది. దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) గుర్తించినట్లు జాతీయమీడియా కథనాలు పేర్కొన్న సంగతితెలిసిందే. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి.

# ఆట గెలిపించి.. అసువులు బాసి!

## క్రికెట్ మైదానంలో ఆడుతూనే ప్రాణాలు వదిలిన బౌలర్

**లక్నో, అక్టోబరు 14 :** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఓ క్రికెట్ ఆటగాడు మైదానంలోనే మృతి చెందాడు. స్థానికంగా జరిగిన ఓ టోర్నమెంట్‌లో అద్భుతంగా బౌలింగ్‌చేసి తన జట్టును గెలిపించాడు కానీ.. జీవిత పోరాటంలో మాత్రం ఓడిపోయాడు. చివరి బంతి వేసిన తర్వాత ఆ బౌలర్ అకస్మాత్తుగా మరణించాడు. ఈ ఘటనతో అందరూ షాక్‌అయ్యారు. ఇందుకు సంబంధించిన విడియోఒకటి వైరల్‌అయింది. మొరాదాబాద్‌లోని బిలారి బ్లాక్‌లో ఉత్తరప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఓ టోర్నమెంట్‌ను నిర్వహించింది. బిలారిలోని చక్కె మిల్లు మైదానంలో ఆదివారం మొరాదాబాద్, సంభాల్ జట్లు తలపడ్డాయి. మొరాబాద్ మొదటబ్యాటింగ్ చేసింది. ఛేదనలో సంభాల్ విజయానికి చివరి నాలుగు బంతుల్లో 14 పరుగులు అవసరం అయ్యాయి. మొరాదాబాద్ ఫాస్ట్ బౌలర్ అహ్మద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. సంభాల్ జట్టు 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. చివరి బంతి పడగానే మొరాదాబాద్ ప్లేయర్లు సంబరాల్లో మునిగిపోయారు అహ్మద్ మాత్రం తీవ్ర అస్వస్థతతో మైదానంలో కుప్పకూలాడు.

అహ్మద్‌ఖాన్ శ్వాసతీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడ్డాడు. భయాందోళనకు గురైన మొరాదాబాద్ ఆటగాళ్లు వెంటనే చికిత్స అందించారు. అక్కడే ఉన్న వైద్యుడు మైదానంలో అతడికి సిపిఆర్ చేశాడు. దాంతో అహ్మద్ కాస్త కుదుటపడ్డాడు. ఆ తర్వాత అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో వైద్యుడు పరిశీలిం చగా.. అహ్మద్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనలో మ్యాచ్ గెలిచిన ఆనందం శోకసం ద్రంగా మారింది. అహ్మద్ స్థానిక మొరాదాబాద్ జట్టుకు సీనియర్ బౌలర్ అని, చాలా యేళ్లుగా క్రికెట్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

# ట్రేడ్ డీల్‌పై మలివిడత చర్చలు

## నేడో రేపో అమెరికాకు భారత్ బృందం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14 :** అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మలివిడత చర్చల కోసం భారత్ బృందం త్వరలో వాషింగ్టన్ వెళ్లనుంది. అధికార వర్గాల కథనం ప్రకారం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, ఒప్పందం తొలి దశను ఖరారు చేయడం లక్ష్యంగా మలి విడత చర్చల కోసం భారత ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం అమెరికా వెళ్లనుంది. అమెరికాతో చర్చలు సానుకూల మార్గంలో సాగుతున్నాయి. ద్వైపాక్షిక ఒప్పందం మొదటి దశ ఈ నెలాఖరు లోపు ముగుస్తుందని రెండు పక్షాలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ట్రంప్ సుంకాల విధింపుతో వాణిజ్య ఒప్పందానికి బ్రేకులుపడ్డాయి. అయితే, పరస్పర సుంకాల వల్ల ఇరుదేశాలకు నష్టం వాటిల్లుతున్నందున సాధ్యమైనంత త్వరగా ట్రేడ్ డీల్‌కు రావాలని నిర్ణయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉభయదేశాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. దీనికి సంబంధించి తొలి దశ చర్చలను అక్టోబర్, నవంబర్‌లో పూర్తి చేయాలని షెడ్యూల్ కూడా చేశారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో వాణిజ్య చర్చలు సాగాయి. ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వాణిజ్య చర్చల కోసం అధికార ప్రతినిధి బృందంతోకలిసి న్యూయార్క్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఇరుదేశాలమధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిపారు. గోయెల్ అమెరికా పర్యటన అంతా సానుకూలంగాసాగింది. ఈ పర్యటనలో పీయూష్ గోయెల్ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్‌తోనూ సమావేశమై సమాలోచనలు జరిపిన విషయం తెలిసిందే.

# రాజకీయ అంశాలు కోర్టులకెందుకు?

## రాహుల్ వ్యాఖ్యలపై దాఖలైన పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 14 :** 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్'అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిజెపి, ఎన్నికల సంఘంపైన 'ఓటు చోరీ' వ్యాఖ్యలు చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసివుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ రాజకీయ అంశాలకు కోర్టులోను వేదిక చేసుకోవద్దు. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. బిజెపి, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని, బీహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు బిజెపి నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు.

## బీహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ..

# లాలూ కుటుంబంపై ఢిల్లీ కోర్టు అభియోగాలు



**పాట్నా, అక్టోబరు 14 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి షాక్ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుతు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పూ చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా అసలు ఇది తప్పుడు కేసు అని రబ్రీదేవి పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనేది ఆరోపణ. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూయాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సిబిఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో 2017లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది.

నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టులకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు. ఇదిలా ఉంటే వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జేడి నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది. బీహార్‌లో అసెంబ్లీ స్థానాలకు నవంబరు 6,11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గని ఎక్కడో తెలుసా?

**వాషింగ్టన్, అక్టోబరు 14 :** బంగారం.. ఈపేరు వింటేనే చాలా మందిలో వైబ్రేషన్లు వస్తాయి. కారణమేమంటే దానిపై వారికి ఉంటే మక్కువ. ముఖ్యంగా మహిళలు బంగారం పేరు వినగానే అటెన్షన్ అవుతుంటారు. పసిడి కొనేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం బంగారం ధర సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటింది. కేవలం ఈ ఒక్క సంవత్సరంలోనే దాదాపు 50 శాతం ధర పెరిగింది. ఇదే సమయంలో కొందరికి విచిత్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అలాంటి వాటిల్లో ప్రపంచంలో అత్యధిక బంగారం ఎక్కడ ఉంది? ఏ దేశంలో ఎక్కువ ఉత్పత్తి అవుతుంది? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ దేశం ఏమిటి? అక్కడ యేదానికి ఎంత బంగారాన్ని వెలికితీస్తారో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలిలా ఉన్నాయి.



ప్రపంచంలో అతిపెద్ద బంగారు గని పేరు నెవాడా గోల్డ్‌మైన్. ఇది అమెరికాలోని నెవాడా రాష్ట్రంలో ఉంది. ఈ గనిలో యేటా టన్నుల కొద్దీ గోల్డ్‌ను వెలికితీస్తుంటారు. భూమిపైనే అతిపెద్ద బంగారు గనిగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఈ బంగారు గనిని బారిక్ గోల్డ్, న్యూమెంట్ కార్పొరేషన్ అనే సంస్థలు కలిపి నడుపుతున్నాయి. ఈ గనిలో యేటా సుమారు వంద టన్నులు అంటే లక్షకిలోల గోల్డ్‌ను బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భూమిపై వినియోగంలో ఉన్న అతిపెద్ద బంగారు గని ఇదేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అగ్రరాజ్యమైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ బంగారు గని ఒక అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి ప్రపంచంలో ఎక్కువ బంగారం నిల్వలు ఉన్న దేశం కూడా యుఎస్ కావడం గమనార్హం. అంతలా అమెరికా బంగారాన్ని రిజర్వ్ చేయడానికి ఈ గని కూడా ఒక కారణమని అక్కడి మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే మన దేశంలో కూడా బంగారు గనులు ఉన్నాయి. అయితే వాటి నుంచి లభించే బంగారం చాలా తక్కువ. ఇక్కడ బంగారు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి బంగారం ఇతర దేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం.

# సరిహద్దుల్లో భద్రత మరింత పెంపు

## కీలక మార్గాల మూసివేత



**న్యూఢిల్లీ, అక్టోబరు 14 :** ఉగ్ర చొరబాట్ల కట్టడికి భారత సైన్యం కీలక చర్యలు తీసుకొనేందుకు సిద్ధమైంది. శీతాకాలం రాబోతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి భద్రతను మరింత పెంచుతోంది. ఇందులో భాగంగా కీలక మార్గాలు మూసివేసింది. అదనపు బలగాలను మొహరించినట్లు తెలుస్తోంది. పహల్గాం దాడిని దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల్లోని భద్రతను పునరుద్ధరిస్తోంది. ఈ మేరకు విశ్వసనీన వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం వెల్లడించింది. సాధారణంగా కశ్మీర్ లోయలో శీతాకాల సమయంలో మంచు దట్టంగా కురుస్తుంది. ఆ సమయంలో కీలక మార్గాల్లో భద్రత పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ఎత్తైన ప్రాంతాల్లో నిఘాకు సవాళ్లు ఎదురవుతాయి. దీన్ని అవకాశంగా తీసుకుని చలికాలానికి ముందు ఉగ్ర చొరబాట్ల ఘటనలు పెరుగుతాయి. వీటిని నియంత్రించేందుకే సరిహద్దుల్లో ఆర్మీ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కంచెను కట్టుదిట్టం చేయడంతో పాటు ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరిస్తోంది. ఇక సరిహద్దులను ఆనుకుని ఉండే కొన్ని కీలక మార్గాలను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, థర్మల్ ఇమేజర్లు, అధునాతన కెమెరాలు, చిన్న చిన్న డ్రోన్లతో చొరబాటు యత్నాలను తిప్పికొడుతున్నట్లు ఆర్మీ విశ్వసనీన వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి రద్దీ ప్రాంతాలకు దూరంగా ఒక రహస్యప్రాంతంలో దాక్కొన్న సందర్భాలున్నాయి. కానీ, ఇటీవల ఉగ్రవాదులు తమ పంథా మారుస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు దగ్గరగా రెండు,మూడు రహస్య ప్రాంతాల్లో నక్కి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇక, భద్రతా సిబ్బంది నిఘా నుంచి తప్పించుకునేందుకు సామాన్య పౌరులవలే స్థానిక మొబైల్ నెట్‌వర్క్‌నువాడి కమ్యూనికేషన్ చేసుకుంటున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. దీంతో దేశంలోకి చొరబడిన తర్వాత వారిని పట్టుకోవడం సమస్యగా మారుతోంది. అందుకే వీరు దేశంలోకి రాకుండా చొరబాట్లను అడ్డుకుని సరిహద్దుల వద్దే పట్టుకోవాలని ఆర్మీ భావిస్తోంది.

# సంక్షిప్తంగా..

## కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తు: సుప్రీం

**న్యూఢిల్లీ, అక్టోబరు 14 :** కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసింది. గత నెల 27న టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. 41 మంది మృతి చెందిన తొక్కిసలాట ఘటన దేశాన్ని కదిలించిందని పేర్కొంది. ఈ మేరకు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. నిస్సందేహంగా.. న్యాయసమ్మతమైన, పక్షపాతరహిత విచారణ అనేది పౌరుల హక్కు అని వ్యాఖ్యానించింది.

## పదవి నుంచి తప్పకుంటా: కేంద్రమంత్రి సురేష్ గోపి



**తిరువనంతపురం, అక్టోబరు 14 :** మళ్లీ యాక్టింగ్ వైపు మళ్లే యోచనలో ఉన్నట్లు కేంద్రమంత్రి, బిజెపి ఎంపి సురేశ్ గోపి తెలిపారు. కేరళలోని కన్నూర్‌లో రాజ్యసభ ఎంపి సదానందన్ మాస్టర్ అధికారిక కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ఆదాయం బాగా తగ్గిపోయిందని అన్నారు. దాదాపుగా నిలిచిపోయిందని అన్నారు. ఆదాయంకోసం మళ్లీ నటనపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తన స్థానంలో రాజ్యసభ ఎంపి సదానందన్‌ను నియమించాలని కూడా ప్రతిపాదించానని ఆయన అన్నారు. పార్టీలోతానే అత్యంత పిన్నవయస్కుడినని తెలిపారు. 2008లో పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు ఎన్నుకున్నతనను కేంద్రమంత్రిని చేయాలని పార్టీ భావించినట్లు తెలిపారు. మలయాళం సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడైన సురేశ్ గోపి త్రిసూర్ నియోజకవర్గం నుంచి బిజెపితరఫున పోటీచేసి ఎంపిగాఎన్నికయ్యారు. రాష్ట్రంలో తొలి బిజెపిఎంపిగా రికార్డు సృష్టించారు.

## పుణేలో చిరుత దాడి: చిన్నారి మృతి

**ముంబయి, అక్టోబరు 14 :** పొలంలో పనిచేస్తున్న అయిదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పింపార్ఖేడ్ గ్రామంలో తమ ఇంటి సమీపంలోని పొలంలో పనిచేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్యశైలేష్ బొంబే అనే అయిదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. అక్కడే పనిచేస్తున్న వ్యక్తుల అది గమనించి కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని, 10 బోన్లు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులుపేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో ఆందోళనల అగ్గి

**ఇస్లామాబాద్, అక్టోబరు 14 :** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు చేస్తోన్న ఆందోళనలతో పాకిస్థాన్ భగ్గుమంటోంది. గత వారం మొదలైన ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దాంతో ఒక అధికారి సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహోర్‌లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గాజా యుద్ధం ముగింపుపై పాలస్తీనా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. పాక్ హింసాత్మకంగా మారడం గమనార్హం. ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన తర్వాత ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి ప్లాన్ చేసింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తోన్న ప్రయత్నాలు హింసాత్మకంగా మారుతున్నాయి.

## నిర్మాణరంగ వస్తువులపై జిఎస్టి తగ్గింపు వినియోగదారులకు లాభం



○ నగర కమిషనర్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**:నిర్మాణ రంగ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులకు ఇంటి నిర్మాణం సులభమయ్యే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "బిల్డింగ్ డెవలపర్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్" అంశంపై క్రెడాయ్, నరేడ్కో, బిఏఐ సభ్యులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సప్లయర్లు (సిమెంట్, పెయింట్స్, ఇంటీరిర్, ఎక్టీరియర్), హార్డ్‌వేర్ షాపుల ఎగ్జిబిషన్ స్థానిక ఏసి కాలేజి సెమినార్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ఎగ్జిబిషన్ లోని స్టాల్ లో జిఎస్టీ తగ్గింపు కు పూర్వం, ప్రస్తుతం ఎంత ధరలు ఉన్నదీ తెలుసుకొని, ప్రతి ఒక్కరూ తగ్గింపు ధరలతోనే విక్రయించాలని తెలియచేస్తూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులుబాటుని కల్పించిందన్నారు. ప్రధానంగా నిర్మాణ రంగ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా సాదారణ ప్రజలు ఇళ్లు నిర్మించుకోవాడానికి వీలు కల్గుతుందన్నారు. అలాగే ప్రస్తుతం నిర్మాణం చేసే అపార్ట్మెంట్లలో కూడా ప్లాట్ లు గతం కన్నా తగ్గింపుతో ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి సంస్థ తగ్గింపు ధరలతో కూడిన బోర్డ్ లను కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిఎంసి ఆధ్వర్యంలో నగరంలో విస్తృతంగా జిఎస్టీ తగ్గింపు పై ఈ నెల 19 వరకు ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పోరేటర్ పి.సమతా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, డిసిపి సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్‌బాయ్ ముసుగులో సైబర్ మోసాలు - నిందితుడు అరెస్టు

○ పట్టాభిపురం పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: సామాజిక మాధ్యమాల ద్వారా కాల్‌బాయ్ సేవల ముసుగులో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గుంటూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు.

నిందితుడు చోడ చైతన్య కృష్ణ పవన్ (27), సాయిబాబా గుడి బజారు, ఇంకొల్లు గ్రామం, బాపట్ల జిల్లా నివాసి. కేసు సంఖ్య 414/2025, భారతీయ న్యాయ స్మృతిలో సెక్షన్ 318(4) తో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని 66-C, 66-D సెక్షన్ల కింద అరెస్టయిన అతను పలు ఆడవాళ్ళ పేర్లతో ఫేస్‌బుక్ అకౌంట్లు సృష్టించి పరిచయాలు పెంచేవాడు. కాల్‌బాయ్‌గా పని చేస్తే డబ్బులు వస్తాయని నమ్మించి, నకిలీ ఐడీ కార్డులు చూపించి రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో 20,000 నుండి 30,000 రూపాయలు వసూలు చేసేవాడు.

తరువాత బాదితులను వేర్వేరు నంబర్లతో కాల్ చేసి పోలీసు, కానిస్టేబుల్, సీఐ, హైకోర్టు లాయర్ పేర్లు చెప్పి కేసు నుండి తప్పించుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించేవాడు. గుంటూరులోని ఒక బాదితుని నుండి ఇలా సుమారు కోటి రూపాయలు వసూలు చేశాడు. నిందితుడి గత నేరాల్లో హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో 2022 నుండి 2025 వరకు కలిపి పలు కేసుల్లో 20 లక్షలు పైగా వసూలు చేసినట్లు రికార్డులు వెల్లడించాయి. అరెస్టులో పట్టాభిపురం సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్‌కుమార్, పీఎస్ఐ ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ రాజా కిషోర్ కృషి చేశారు. వీరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. పోలీసులు ప్రజలకు హెచ్చరికగా, గుర్తు తెలియని సామాజిక మాధ్యమ సందేశాలు, ఫ్రెండ్ రిక్వెస్టులకు స్పందించవద్దని, అనుమానం కలిగితే వెంటనే డయల్ 112 లేదా 1930లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రేపు తెనాలిలో మంత్రి నాదెండ్లకు వేదాశీర్వచన సత్కారం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ను, వేద ఆశీర్వచన సభ ద్వారా బ్రాహ్మణ సంఘీయులు సత్కరించ నున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గం పేర్కొన్నారు. స్థానిక బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సేవా సమితి అధ్యక్షులు పురుషోత్తమ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఆర్ శాస్త్రిని గుర్తించి రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా అవకాశం కల్పించిన, తెనాలి శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ను,సత్కరించుకోవడంతోపాటు,రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ ఎమ్ వి ఆర్ శాస్త్రీ అభినందనోత్సవం, ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవిశిష్ట కార్యక్రమంలో, రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు ఎంపికైన, సంఘీయ,ట్రస్ట్ బోర్డు మెంబర్లు,బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ లు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభా పురస్కారాలు, బ్రాహ్మణ కళాకారులకు సత్కారాలు, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, అందించే కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నూకల రామకోటేశ్వరావు కళ్యాణ కళాసధనంలో గురువారం సాయంత్రం ఈ విశిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. బ్రాహ్మణ సంఘీయులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షులు లక్క రాజు లక్ష్మణ రావు, త్రిపురారి భట్ల దత్తు, చెన్నా ప్రగడ శ్రీనివాస్, విష్ణుభొట్ల మణి కిషోర్ దావులూరి శ్యాంసుందర్ శర్మ, నందివెలుగు రామకృష్ణ శర్మ, కొడవటి గంటి కుమార్ అద్దేపల్లి మాధవశాస్త్రి,తదితర సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమలో మహిళ సాధికారతకు మరో ముందడుగు

○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా "మహిళా గ్రీవెన్స్ డే" ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ నియోజకవర్గ ప్రజల కోసం త్వరలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**:గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతీ మంగళవారం ప్రత్యేకంగా "మహిళా గ్రీవెన్స్ డే" నిర్వహణకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం ప్రజల కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తుండగా, నేను నా నియోజకవర్గ మహిళల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ డే" కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఎందుకంటే చాలా మంది మహిళలు తమ సమస్యలను అధికారుల ముందు చెప్పలేకపోతున్నారు. ఈ వేదిక ద్వారా వారు స్వేచ్ఛగా మాట్లాడి, వెంటనే పరిష్కారం పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రతి వారం సంబంధిత శాఖాధికారులను ఆహ్వానించి, ఫాస్ట్ ట్రాక్ పరిష్కార విధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. "ఇది కేవలం వినే కార్యక్రమం కాదు – సమస్య పరిష్కారం జరిగే వరకు మహిళలతో పాటు నిలిచే వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. నియోజకవర్గ ప్రజల కోసం త్వరలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొని వచ్చి, ఇంటి నుండే ప్రజా సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వం, ఒక మహిళా ఎమ్మెల్యేగా నా నియోజకవర్గంలోని ప్రతి మహిళా సమస్యకు అండగా ఉంటాను" అని గళ్ళా మాధవి చెప్పారు.

ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అలసత్వం వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : నీటి సరఫరా వ్యవస్థలో నిర్లక్ష్యం వహించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో తాగునీటి వసతులు, సరఫరాపై కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖలతో మంగళవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పర్యవేక్షణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వివిధ దశలలో నిర్దేశిత సమయంలో చేపట్టాల్సిన పరీక్షలు నిర్వహించక పోయినా, పైప్ లైన్లు నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా ప్రజా ఆరోగ్యం పట్ల తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అధికారులు, సిబ్బంది తమ దీర్ఘకాలిక అనుభవంతో ప్రజలకు మంచి జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మీదట ఎక్కడా ఎటువంటి సంఘటనలు రాకూడదని స్పష్టం చేశారు. తాగునీటి నమూనాలు సేకరించి నప్పుడు ఎక్కడ నుంచి సేకరించింది స్పష్టంగా వివరాలు పొందుపరచాలన్నారు. తాగునీటి నమూనాల సేకరణ, వాటి పరీక్షలు, ఫలితాలు, ఇతర నివేదికలు నిర్దేశిత కాలంలో చేయాలని ఆదేశించారు. వాటికి ఎస్.ఓ.పి ఉంటే వాటిని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి నివేదిక విధిగా వివరాలు కలిగి ఉండాలని చెప్పారు. ఎటువంటి సంఘటనలు ఎక్కడా జరగరాదని, అందుకు ప్రతి రోజు అన్ని అంశాలను ముందుగానే పర్యవేక్షణ చేసుకోవాలని అన్నారు. అనుకోని విధంగా ఒక సంఘటన జరిగితే తక్షణ స్పందన, నివారణపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై దృష్టిసారించడం వలన చాలా వరకు ఆరోగ్య సమస్యలు నివారించగలమని అన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఎం.ఎల్.హెచ్.పిలు వారి పరిధిలో ఉన్న వసతి గృహాలు వద్ద తాగునీటి సరఫరా, వసతుల నమూనాలు సేకరించి నీటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ప్రజా ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం వీలైనంత ఎక్కువ సంఖ్యలో తాగునీటి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అనధికార, అనుమతులు లేని ఆర్.ఓ లను గుర్తించాలని అన్నారు. పారిశుధ్యం ఎక్కడా లోపం లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు.

ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి.శ్రీనివాస్ గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి తమ విభాగాల్లో చేపడుతున్న నీటి నమూనాల సేకరణ, పరీక్షలు తదితర అంశాలను వివరించారు.

వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు శోభారాణి మాట్లాడుతూ గత ఏడాది తెనాలి మండలం కొలకలూరి గ్రామం ఎస్.సి కాలానికి నేరుగా నీటి పథకంకు ఎక్కించిన నీటిని సరఫరా చేయడం జరిగిందని, నీటి పథకం పాచిపట్టి ఉండటం వలన సంఘటన జరిగిందని వివరించారు.

నిర్దేశిత సమయంలో మార్గదర్శకాలకు అనుగుణంగా పర్యవేక్షణలో లోపాలు నివారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆర్.ఓ నీటి సరఫరాలోనూ లోపాలు నివారించాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు యు.చెన్నయ్య, బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మయూరి, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి. దుర్గా భాయి, తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**: జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో సిసిఐ పత్తి కొనుగోలుకు నోటిఫై చేసిన గాయత్రి కాటన్ ప్రెస్సింగ్ మిల్లు వద్ద పత్తి కొనుగోలు సన్నద్ధత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మిల్లు సమీపంలో సాగులో ఉన్న పత్తి పంటను, పరిశీలించి, పంట పరిస్థితిని, సాగు ఖర్చులు, దిగుబడి తదితర వివరాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. పత్తి పంట సాగు వివరాలను రైతులు జిల్లా కలెక్టర్ కు తెలియజేస్తూ రెండు, మూడు వారాల్లో పత్తి మొదటి కోతకు సిద్ధమవుతుందని, దిగుబడిని బట్టి మూడు నాలుగు కోతలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల పత్తి దిగుబడి కొంత తగ్గే అవకాశం ఉందని, ఎకరాకు సాగు ఖర్చులు రూ. 50 వేల వరకు అవుతున్నాయని తెలిపారు. కోస్తా ఆంధ్రాలో వాతావరణ పరిస్థితుల వలన తేమ శాతం ఎక్కువగా ఉంటుందని సీసీఐ పత్తి కొనుగోలుకు నిర్దేశించిన 6.5% తేమను 15% కు పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. అనంతరం గాయత్రి కాటన్ ప్రెస్సింగ్ మిల్లులో జిన్నింగ్ మిషన్ల ద్వారా పత్తి నుంచి దూదిని తీసే ప్రక్రియను, ప్రెస్సింగ్ యూనిట్ ద్వారా దూదిని బేళ్ళుగా కట్టే విధానంను పరిశీలించారు. సీసీఐ ద్వారా ప్రతి కొనుగోలుకు సంబంధించి సన్నద్ధత ఏర్పాట్లు గురించి వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, కాటన్ మిల్లుల నిర్వాహకులతో చర్చించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా కాటన్ మిల్లుల నిర్వాహకులు మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, తెలంగాణ నుంచి తీసుకువచ్చే పత్తికి మార్కెట్ సెస్ రాయితీ ఇవ్వాలని ప్రభుత్వానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, తహసిల్దారు క్షమారాణి, కాటన్ మిల్లు నిర్వాహకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## పోలీసు ఐటీ కోర్ టీంను అభినందించిన ఎస్పీ

○ గుంటూరు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రికవరీ చేసిన 250 మొబైల్ ఫోన్ల పంపిణీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**:దొంగలించబడినా... పోగొట్టుకున్నా... బాధితులకు తిరిగి మొబైల్ ఫోన్ అందేలా గుంటూరు జిల్లా పోలీసులు మరోసారి చాటిచెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోయిన మొబైళ్లను గుర్తించి ఉచితంగా యజమానులకు అందజేస్తూ ప్రజల మనసులు గెలుచుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో దొంగిలించబడిన, పోగొట్టుకున్న 250 మొబైల్ ఫోన్లను (రూ.50 లక్షల విలువ) జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ బాధితులకు స్వయంగా అందజేశారు.

**6.82 కోట్లు విలువైన 3414 ఫోన్ల రికవరీ**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఇప్పటి వం-కు గుంటూరు జిల్లాలో మొత్తం 3414 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.6 కోట్లు 82 లక్షలుగా ఉందని చెప్పారు. "బాధితుల కష్టం తగ్గించడమే కాకుండా పోలీసులపై నమ్మకాన్ని పెంచడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది" అని పేర్కొన్నారు.

**పోయిన వెంటనే ఫిర్యాదు చేయండి**

మొబైల్ ఫోన్ పోయిన వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కి లేదా 8688831574 పోలీస్ హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఫోన్ లొకేషన్ ట్రేసింగ్ సులభమవుతుందని తెలిపారు. మొబైల్‌లో వ్యక్తిగత, బ్యాంకు, ఇతర గోప్యమైన వివరాలు ఉండటం వల్ల అవి నేరస్తుల చేతికి చిక్కితే దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి**

"ఈ రోజుల్లో ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా మొబైల్ ద్వారానే జరుగుతున్నాయి. దీనిని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తున్నారు. భయపెట్టి, ఆశపెట్టి ఖాతాల నుండి డబ్బులు కాజేస్తున్నారు" అని ఎస్పీ జిందాల్ తెలిపారు. అనుమానాస్పద లేదా బెదిరింపు కాల్ వస్తే 1930, డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాంటి కాల్స్‌కు భయపడకుండా వెంటనే బ్లాక్ చేయాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

**రికవరీ బృందానికి అభినందనలు**

"మా ఫిర్యాదులు చేసిన వెంటనే పోలీసులు సీరియస్‌గా తీసుకుని సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను కనుగొంటున్నారు. ఎటువంటి రుసుము లేకుండా మాకు తిరిగి ఇస్తున్నారు" అని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. "ఇది ప్రజలకు అండగా నిలిచే పోలీసింగ్‌కు అద్దం పడుతోంది" అని ఎస్పీ అన్నారు.

మొబైల్ రికవరీలో కీలక పాత్ర పోషించిన ఐటీ కోర్ సీఐ నిషార్ భాష, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమామ్ సాహెబ్, యాసిన్, అరుణ, మానస, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లా గార్లను ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

## 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఏవో పదోన్నతులు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**:ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్తులో పనిచేస్తున్న 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఏవో (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)పదోన్నతులు లభించాయి. పదోన్నతిపత్రాలను మంగళవారం జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో సిహెచ్. కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, ఏవో రత్నబాబు, పంచాయతీరాజ్ ఉద్యోగుల రాష్ట్ర సంఘం నాయకుడు బండి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరెడ్డి, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ క్రిస్టినా మాట్లాడుతూ, పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత నిబద్ధతతో పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సేవలో క్రమశిక్షణ, బాధ్యతాయుత ధోరణి పాటించితే భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

## రెండవ వాటర్ ప్లాంటు ప్రారంభం



○ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన స్థానిక నాయకులు

○ దివీస్ లేబరేటరీస్ సంస్థ సహకారంతో టిడ్కో గృహసముదాయం వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటు

○ దివీస్ లాబొరేటరీస్ సంస్థకు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన టిడ్కో నివాసితులు

**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్)**:: రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో దివీస్ లాబొరేటరీస్ సహకారంతో మంగళగిరి పట్టణం టిడ్కో గృహసముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రెండవ రక్షిత మంచినీటి ప్లాంట్లను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు మంగళవారం ప్రారంభించారు. రక్షిత మంచినీటి ప్లాంట్?లను ఏర్పాటు చేసిన దివీస్ లాబొరేటరీస్ వారిని, అందుకు కృషి చేసిన మంత్రి లోకేష్‌కు టిడ్కో నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 30కి పైగా మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్క ప్లాంట్ రూ 16 లక్షల రూపాయల వ్యయంతో అత్యధునాతన మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రోజుకు 20 గంటల పాటు ప్లాంట్ పనిచేస్తుందని, గంటకు వేయి లీటర్ల నీటిని ప్యూర్‌పై చేస్తుందన్నారు. ఈ సందర్భంగా దివీస్ లాబొరేటరీస్ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే జలధార పేరుతో నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్న మంత్రి నారా లోకేష్ తక్షణమే పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పందేటి తిరుపతయ్య, ఆకురాతి నాగేంద్రం, బూదాటి శ్రీనివాసరావు, ఇండ్ల రజిని, షేక్ సుభాని (గల్ఫ్), షేక్ ఆన్వర్, వంగర సదాశివరావు, పఠాన్ రియాజ్ ఖాన్, చింతక్రింది వెంకటేశ్వరరావు, కటకం కల్యాణ చక్రవర్తి, పొదిలి హరిబాబు, ఉప్పు మహేష్, అవ్వారు సుబ్బారావు, గంజి పూర్ణ, కేసనం సాయి భావన, గంజి శివసుధ, చెన్నపట్నం సత్యా సింగ్, సలా లీలావతి, దండే శ్రీ లక్ష్మి, షేక్ నీలోఫర్, దివి జయశ్రీ, గంగాధర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**:ప్రమాదాల సంభవించినప్పుడు రోగికి మెదడు మరియు గుండె ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్తప్రసరణ ఆగిన సందర్భంలో అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవయవాలకు సరఫరా చేయుటకు గాను సి పి ఆర్ అనగా కార్డియో పల్మనరీ రీససిటేషన్ ప్రక్రియ ద్వారా రోగిని కాపాడవచ్చు దీనిని వారోత్సవాలు జరపాలని ప్రభుత్వం ఇచ్చిన సూచనల ప్రకారం ఈనెల 13 నుండి 17 వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సిబ్బందికి ఆరోగ్య కార్యకర్త ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించుటకు AI-IMS ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక డ్రైవర్స్ కాలనీ యు పి హెచ్ సి నందు జరిగిన కార్యక్రమంలో స్థానిక ఉర్దూ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు తో పాటు హాస్పిటల్ సిబ్బందికి అవగాహనా కల్పించారు. ఎయిమ్స్ నుండి డాక్టర్ అనంత ప్రకాష్ సీనియర్ సి ఎఫ్ ఎం డాక్టర్ విగ్నేష్ జూనియర్ సి ఎఫ్ ఎం నర్సింగ్ ఆఫీసర్ రవి ఇంటర్ డాక్టర్స్ డాక్టర్ వివేక్ విక్రమ్ కృష్ణ మొదలగు వారు పాల్గొని అవగాహన మరియు సి పి ఆర్ చేయడం నేర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో నిడమర్రు uphc వైద్యులు డాక్టర్ పి హర్షవర్ధన్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి గారు, ఉర్దూ స్కూల్ ఇంచార్జ్ HM షాజీర్, సమియుల్లా, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు అనంతరం డాక్టర్ మానస ప్రజలు సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించి సిపిఆర్ యొక్క ఆవశ్యకతను వివరించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# కాకినాడ సెజ్ అవార్డు భూములు తిరిగి రైతులకే రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీకి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా చర్చించిన పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిలబెట్టుకున్నారు. సెజ్ పరిధిలోని 2,180 ఎకరాల భూములకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసేలా పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించారు. దీంతో కాకినాడ తీరంలోని తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి మండలాల పరిధిలో సుమారు 1,551 మంది రైతులకు మేలు జరగనుంది. కాకినాడ సెజ్ రైతుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తీసుకువెళ్లారు.

ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ కాకినాడ సెజ్ రైతులకు ఊరట కలిగించిన కూటమి ప్రభుత్వం. కాకినాడ సెజ్ కు భూములు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు కాకినాడ సెజ్ లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్ లకు రిజిస్ట్రేషన్ రుసుములు, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయకూడదని ఆదేశాలలో పేర్కొన్నారు. ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో ఈ భూములు ఉన్నాయి.

కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కి ఇచ్చిన భూమి, తిరిగి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ కాక సతమతం అవుతున్న విషయంపై దృష్టి సారించిన శ్రీపవన్ కళ్యాణ్ గారు గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కాకినాడ సెజ్ భూములపై జీవో నెం. 12 విడుదల అయినా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు మేలు జరగలేదు. వారి పేరున రిజిస్ట్రేషన్లు జరగలేదు. దీంతో పిల్లలకు పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడటం లేదని రైతులు పవన్ కళ్యాణ్‌కి గతంలో నివేదించారు. దీనిపై పూర్తి వివరాలు పరిశీలించి, రైతులకు మేలు జరిగేలా చూస్తానని పవన్ కళ్యాణ్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసన మండలిలో సమావేశాల్లో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల పడుతున్న ఇబ్బందులను సభలో ప్రస్తావించారు. భూములు రైతుల పేరిట రిజిస్ట్రేషన్ కాకపోవడంతో రైతు భరోసా వంటి పథకాల లబ్ధి అందడం లేదని, బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికీ వీలు లేకుండా పోయిందని రైతుల వ్యధను సభ ముందుంచారు. దీంతో ఈ సమస్య మరోసారి చర్చనీయాంశం అయ్యింది.

మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీలను మినహాయించి తిరిగి రైతుల భూములు రైతులకు తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలు విడుదలయ్యాయి. కాకినాడ సెజ్ రైతులకు ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి ఉప ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే 'బొల్లా' వ్యాఖ్యలపై 'మహిళా కమిషన్' సీరియస్

- మహిళలకు క్షమాపణలు చెప్పకుంటే తీవ్రంగా పరిగణిస్తాం..
- హెచ్చరించిన డాక్టర్ రాయపాటి శైలజ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : మహిళలను కించపరిచే విధంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యలు చేయడాన్ని 'రాష్ట్ర మహిళా కమిషన' తీవ్రంగా ఖండిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. "ఆడవాళ్ళంతా తాగుబోతులు" అన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వ్యాఖ్యలపై మంగళవారం మీడియా కథనాలు దుమారం రేగాయి. ఈ వ్యవహారంపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మీడియాతో మాట్లాడి తీవ్రంగా స్పందించారు. మహిళలను అవమానపరుస్తూ చేసిన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చగా చెప్పారు. అలాగే, ఆయన దిగజారుడు మాటల్ని బట్టి బొల్లా బ్రహ్మనాయుడుకి మహిళల పట్ల ఉన్న చులకన భావం అర్థమవుతుందన్నారు. మహిళలను అగౌరవపరిచినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిన నైతిక బాధ్యత బ్రహ్మనాయుడు పై ఉందన్నారు. అలా చేయకుంటే మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని రాయపాటి శైలజ హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల మాటలు ప్రజలు ఆదర్శవంతంగా స్వీకరించేలా ఉండాలి తప్ప అసహ్యించుకునేలా ఉండరాదని హితవు చెప్పారు. సంస్కారవంతులెవరూ బొల్లా బ్రహ్మనాయుడు మాదిరిగా మాట్లాడరని చెప్పారు. మహిళలను అవమానించే నాయకులు ప్రజాసేవకు అనర్హులని రాయపాటి శైలజ అన్నారు. ఒక మహిళపై ఎవరైనా వ్యాఖ్యలు చేసే ముందు వారింట్లో తల్లి, చెల్లి, భార్య, నిత్యం పూజించే దేవత కూడా మహిళనే అనేది గుర్తుపెట్టుకోవాలన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బ తీసే ప్రతీ వ్యాఖ్యను కూడా కమిషన్ తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. మహిళల్ని తూలనాడుతూ వ్యాఖ్యలకు పాల్పడే రాజకీయ నేతలపై నిఘాపెట్టి ప్రభుత్వ పెద్దలు సైతం ఇలాంటి విషసంస్కృతిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ గుర్తుచేశారు.

## జిజిహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వికి ఘన సత్కారం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్, బిజినెస్ బై బ్రాహ్మిన్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ రమణ యశస్వి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జిజిహెచ్‌లోని ఆయన చాంబర్లో సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో బిజినెస్ బై బ్రాహ్మిన్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ కె. శ్రీధర్‌బాబు, సెక్రటరీ బి. హేమంత్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, వీర కుమార్, బందా సాయి, సాయిరాం, చైతన్య, మాధవ్, ఫణి కుమార్, కోటేశ్వరరావు, రమణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. రమణ యశస్వి మరిన్ని ఏళ్ల పాటు ప్రజాసేవలో కొనసాగుతూ సమాజానికి మేలు చేకూర్చాలని అందరూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్టీసిలో రిటైర్డు ఉద్యోగులకు మళ్లీ 'ఆర్.ఇ.యం.యస్' అమలు చేయాలి

- ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ ఆర్టీసి విలీనానికి ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు గతంలో అమలులో ఉన్న రిటైర్డు ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆర్.ఇ.యం.యస్) పునరుద్ధరణ చేయాలని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ స్కీమ్ కింద విల్లింగు అయిన రిటైర్డు, మెడికల్ అన్‌ఫిట్, వీఆర్ఎస్ పెట్టుకున్న ఉద్యోగులు, వారి భార్యాభర్తలు ఆర్టీసి ఆసుపత్రుల్లో పూర్తి వైద్యసౌకర్యాలతో పాటు మందులు పొందేవారు. అలాగే రెఫరల్ ఆసుపత్రుల ద్వారా జీవితకాలం నాలుగు లక్షల రూపాయల వరకు చికిత్స ఖర్చులను మేనేజ్‌మెంట్ భరించేది. కానీ, విలీనానంతరం 2020 నుండి ఈ సదుపాయం నిలిపివేయడంతో సుమారు ఆరు వేల మంది వరకు రిటైర్డు ఉద్యోగులు వైద్యసౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ పేర్కొంది. ఈ అంశంపై ఆర్టీసి విసి, యం.డి ద్వారకా తిరుమలరావుకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఈ స్కీమ్ అమలు చేయడానికి జీఓ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడంతో రిటైర్డు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, నిబంధనల మేరకు విల్లింగు అయినవారితో డబ్బులు స్వీకరించి, ఇ.హెచ్.యస్ ద్వారా మరియు ఆర్టీసి ఆసుపత్రులలో వైద్యసౌకర్యాలు, మందుల పంపిణీ జరిగేలా తక్షణ ఆదేశాలు ఇవ్వాలని యూనియన్ కోరింది.

## శ్రీశైలంలో ప్రధాని పర్యటన భద్రతా ఏర్పాట్లపై డిజిపి సమీక్ష



**శ్రీశైలం,(జర్నలిస్ట్ ఫైల్)** : ఈనెల 16న భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటించనున్న నేపథ్యంలో, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ప్రధాని పర్యటించే హెలిపాడ్, రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం, ఆలయం పరిసరాలు, సేఫ్ హౌస్ మొదలైన ముఖ్య ప్రాంతాలను స్వయంగా పర్యటించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భద్రతా సమీక్షలో కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, ఈగల్ టీమ్ ఐజీ ఆకే. రవికృష్ణ, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, అదిరాజ్ సింగ్ రాణా, అడిషనల్ ఎస్పీ ఎం. జావళి, ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ పాల్గొన్నారు.

# గూగుల్ తో ఒప్పందం.. సువర్ణ అధ్యాయం

- ఇదొక చారిత్రాత్మకమైన ఘటన
- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దార్శనికతకు నిదర్శనం
- ఇక ఐటీ చూపు విశాఖ వైపే..
- గూగుల్ ఒప్పందంపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**:ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ దార్శనికతకు, విజనరీకి నిదర్శనం గూగుల్ తో ఒప్పందమని, ఇది ఏపీ చరిత్రలో సువర్ణ అధ్యాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో సబ్-సీ కేబుల్ ల్యాండింగ్ సెంటర్‌కు ఏపీతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. దేశంలోనే తొలి ఏఐ హబ్ ను విశాఖలో ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని చెప్పారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల పారిశ్రామిక ఒప్పందం జరగడం ఇదే ప్రథమమని తెలిపారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల ఉద్యోగాలు రానున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు. డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవడమే కాకుండా విద్యా, వైద్య రంగాలు బలపడనున్నాయని తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో హైటెక్ సిటీ నిర్మాణం జరిగిందని, ఇది రాష్ట్ర భవితకు గేమ్ ఛేంజర్ అయ్యిందని, ఇప్పుడు ఏపీలో నెలకొల్పనున్న ఏఐ సెంటర్ మళ్లీ గేమ్ ఛేంజర్ గా మారుతుందని పేర్కొన్నారు. సబ్ సీ సెంటర్ ను అంతర్జాతీయ సంస్థలకు అనుసంధానం చేయడం ద్వారా విశాఖపట్నానికి మంచి పేరు రానుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2028-32 నుంచి రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ఏటా 10,518 కోట్లు సమకూరుతుందన్నారు. దేశంలో వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర విజన్ - 2047కు సాధనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని తెలిపారు.

# గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందం ఒక చారిత్రాత్మక ఘట్టం

- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దూరదృష్టి ఫలితం - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)**:ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఒప్పందం ఒక చారిత్రాత్మక ఘట్టమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దూరదృష్టి ఫలితంతోనే ఇది సాధ్యమైనదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి కొత్త దిశలో అడుగుపెడుతుందని, సాంకేతిక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టే చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా తీర్చిదిద్దగా, ఇప్పుడు విశాఖను ఐటీ హబ్‌గా రూపుదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. "ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నారు. ఇది ఆయన దూరదృష్టి, సాంకేతిక నైపుణ్యం, అభివృద్ధి పట్ల అంకితభావానికి నిదర్శనం" అని అన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వల్ల 1.88 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉత్తరాంధ్రలో టెక్నాలజీ, ఉద్యోగాలు, అభివృద్ధి కొత్త యుగం ఆరంభమవుతుందని గళ్ళా మాధవి తెలిపారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఐటీ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గర్వకారణమైన రోజు - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక నిర్ణయమని గళ్ళా మాధవి తెలిపారు.

# శ్రీశైలంలో ప్రధాని పర్యటనకు 1800 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



**నంద్యాల,(జర్నలిస్ట్ ఫైల్)** : ఈనెల 16న భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటనకు రావడంతో నంద్యాల జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆధ్వర్యంలో సుమారు 1800 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిష్టాత్మక బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రధాని హెలిపాడ్ నుంచి ఆలయ దర్శనం ముగిసే వరకు అన్ని ప్రాంతాలలో కఠిన తనిఖీలు జరుగనున్నాయి. ముఖ్య కూడళ్లలో, సున్నిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో పికెట్లు ఏర్పాటు చేయగా, రోడ్‌టాప్ సిబ్బందిని బైనాక్యులర్‌లతో నిరంతర నిఘా కోసం నియమించారు. శ్రీశైలంకు వచ్చే ప్రతి వాహనం 24/7 తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

భద్రతా సిబ్బందిని 10 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ఉన్నత అధికారిని ఇన్‌చార్జిగా నిర్ణయించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల జియోగ్రాఫికల్ మ్యాప్ ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలను ఎస్పీ సిబ్బందికి వివరించారు. హెలిపాడ్, ఆలయం, శివాజీ స్ఫూర్తి కేంద్రం పరిసరాల్లో యాక్సెస్ కంట్రోల్ అమలు చేసి ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాల్లో క్షుణ్ణ తనిఖీలు నిర్వహించనున్నారు. క్రౌడ్ కంట్రోల్ కోసం రోప్‌టాప్, స్పెషల్ పార్టీలు, క్యూఆర్టీలను నియమించగా, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతర కెమెరా మానిటరింగ్ చేపడతారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పర్యటన బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి 'ఆత్రేయ డిజిటల్స్' సాయంతో ప్రత్యేక డ్యూటీ పాస్‌లు అందించగా, డ్యూటీ సమయంలో ఐడి కార్డులు ధరించడం తప్పనిసరి చేశారు. రెవిన్యూ అధికారులు ఇచ్చిన పాస్‌లను కూడా క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

# ఘనంగా ప్రారంభమైన ఏ.పి.ఎస్.పి.ఎఫ్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఏ.పి.ఎస్.పి.ఎఫ్ డైరెక్టర్ జనరల్ డా.సి.యం.త్రివిక్రమ వర్మ, ఇన్స్పెక్టర్ జనరల్ బి.వి. రామిరెడ్డితో కలసి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించారు. ఏ.పి.ఎస్.పి.ఎఫ్ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీల్లో రాష్ట్రంలో గల వివిధ యూనిట్ల నుండి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డైరెక్టర్ జనరల్ డా.సి.యం.త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ క్రీడల వలన సిబ్బందిలో మెరుగైన క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, ఐకమత్యం పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి తేడా లేదని, క్రీడా స్ఫూర్తి గొప్పదని అన్నారు. ఏ.పి.ఎస్.పి.ఎఫ్ బలోపేతానికి కృషి చేస్తున్నామని చెప్పారు. నూతన నియామకాలు చేపట్టి నూతన ఉత్సాహం తెచ్చుటకు ప్రయత్నిస్తున్నామని, ప్రభుత్వం మంచి సహకారం అందిస్తుందని తెలిపారు. ఏ.పి.ఎస్.పి.ఎఫ్ పై ప్రభుత్వానికి మంచి నమ్మకం ఉందని దానిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇన్స్పెక్టర్ జనరల్ బి.వి. రామి రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్ జనరల్ గా త్రివిక్రమ వర్మ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఏ.పి.ఎస్.పి.ఎఫ్ లో వినూత్న మార్పులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల మినీ శిక్షణా కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించడం జరిగిందని చెప్పారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఉద్యోగుల పదోన్నతులు, నూతన నియామకాలు పట్ల దృష్టి పెట్టారని తెలిపారు. క్రీడల పోటీలతో పాటు పెరేడ్ నిర్వహించుటకు చర్యలు చేపట్టారని అన్నారు. ఈ క్రీడా పోటీలలో విజయవాడ జోన్ కామాండెంట్ ముద్దాడ శంకర్రావు, కమాండెంట్ డి.ఎన్.ఏ.భాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఓ మైలురాయి



- చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ల కృషి అభినందనీయం
- సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**:విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని, ఈ సెంటర్ కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందం హర్షణీయమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మంగళవారం వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి తీసుకురావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల కృషి ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మన్నవ మోహనకృష్ణ కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇప్పుడు విశాఖకు గూగుల్‌ని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని తెలిపారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థవంతమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ ఉండబోతుందని, విశాఖ నుంచి 12 దేశాలతో సబ్ సీ-కేబుల్ విధానం ద్వారా అనుసంధానం అవుతాయంని పేర్కొన్నారు. అమెరికా వెలుపల గూగుల్ సంస్థ ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారని, ఈ డేటా సెంటర్ ద్వారా ప్రపంచ స్థాయి ఏఐ నిపుణులు తయారయ్యేందుకు అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ. 11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందని, గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని మన్నవ మోహనకృష్ణ విశ్వాసం వ్యక్తం చేశారు.

## పెదపూడి సొసైటీ మెంబర్ తిరుపతిరావు చెంచుపేటలో... దారుణహత్య

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**: పట్టపగలు నడిరోడ్డు పైన, ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తిని కొబ్బరికాయల కత్తితో దాడి చేసి హతమార్చిన ఉదతం పట్టణంలో కలకలం రేపింది. త్రీ టౌన్ పరిదిలోని చెంచుపేటలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో చోటు చేసుకున్న ఈ దారుణం వివరాలు ఇలా ఉన్నాయి. అమృతలూరు మండలం కోడితాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి, తెనాలి చెంచుపేటలో నివాసముంటున్న తన పెద్ద కుమార్తె గండికోట దుర్గ ఇంటిలో కొంతకాలంగా ఉంటున్నారు. తిరుపతిరావు మంగళవారం ఉదయం టిఫిన్ చేయడానికి, ఇంటి నుండి బయటకు వచ్చి, చెంచుపేట ఎమ్మెల్యే బజార్లోని టిఫిన్ సెంటర్ దగ్గర తన ద్విచక్ర వాహనంపై ఉన్న సమయంలో, మాస్కు ధరించి, హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి, స్కూటీపై వచ్చి వెంట తెచ్చుకున్న కొబ్బరికాయలు నరికె కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి వెళ్లిపోయాడు. ఈ సంఘటనలో తిరుపతిరావు ఘటనా స్థలంలోనె మృతి చెందాడు. ఊహించని విధంగా, పట్టపగలు చోటుచేసుకున్న, దారుణ హత్య,ఆ ప్రాంతంలో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న త్రీటౌన్ సి ఐ. సాంబశివరావు,

డీఎస్పీ జనార్ధనరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విచక్షణారహితంగా జరిగిన హత్య వెనుక, ఆంతర్యం ఏమిటనే కోణంలో ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ను రంగంలోకి దింపారు. ఈ సందర్భంగా సిఐ.ఎస్ సాంబశివరావు తమకు లభించిన సమాచారాన్ని మీడియాకు వివరించారు. హత్య గావించబడిన తిరుపతిరావు, కోడి తాడిపరు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుంటాడని,తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడు,పెదపూడి సొసైటీ మెంబెర్ గా కూడా ఉన్నాడని లభించిన సమాచారమని తెలిపారు.

అతని అయిదురు కుమార్తెలలో పెద్ద కుమార్తె,దుర్గ చెంచుపేటలో ఉంటారని, గత కొంతకాలంగా పెద్ద కుమార్తె దగ్గర ఉంటున్న తిరుపతిరావు హత్య ఉదంతంలో, మృతుడి భార్య జూటూరి ఇందిర ఇచ్చిన పిర్యాదు మేరకు విభిన్న కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు, సిఐ సాంబశివరావు తెలిపారు. ఇదిలా ఉండగా పాత కక్షలు, కుటుంబ కలహాలు నేపథ్యంలో చోటు చేసుకున్న హత్య అనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467